పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# రూ.20 లక్షల 'లంచం'తో..!
## ఏసీబీకి చిక్కిన "తహసీల్దార్-సర్వేయర్"!!

- రూ.30 లక్షలు డిమాండ్..! రూ.20 లక్షలకు కుదిరిన బేరం..!
- హెచ్ఎండీఏ సర్వే నివేదికలో అవినీతి బాగోతం..!

- మిగతా 6లో...





ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం..

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

## బౌరంపేట్ అక్రమ నిర్మాణాలపై..
# రెవెన్యూ 'పంజా'..!

'పెన్ పవర్' వార్తా కథనానికి స్పందించిన ఎమ్మార్వో రాజేశ్వర్ రెడ్డి..
సర్వే నెం.578, 580లో 6 బేస్మెంట్లు- 2 గదులు నేలమట్టం..

-4లో

# కన్నుల పండువగా బతుకమ్మ ఉత్సవాలు..
## అంబరాన్నంటిన సంబరాలు!



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఆడబిడ్డలంతా కలిసి బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటూ అలరిస్న్తిన్నారు. 2026 అక్టోబర్ 10న ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహిస్తున్నారు. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా, రెండో రోజు అటుకుల బతుకమ్మగా అలరించిన బతుకమ్మ.. మూడోరోజైన 2026 అక్టోబర్ 12 (సోమవారం) ముద్ద పప్పు బతుకమ్మగా దర్శనమిస్తోంది. బతుకమ్మ సంబరాలకు సంబంధించిన ఫోటోలు మీకోసం..



# ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి..
## కుటుంబానికి అండగా రేవంత్ సర్కారు

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో జగిత్యాల వాసి సుదర్శన్ గౌడ్ మృతి
- మృతుడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం రేవంత్
- ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన బాధితుడు
- మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు అధికారులకు ఆదేశాలు

-6లో

# రాజ్యాంగ వ్యవస్థలపై ఇండియా కూటమి దాడి



**హైదరాబాద్ పెన్ పవర్:** : ఎన్నికల్లో ప్రజా మద్దతు పొందలేక, రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలపై 'ఇండియా' కూటమి దాడి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.."దేశవ్యాప్తంగా అక్రమ ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులే. మధ్యప్రదేశ్‌లో 60 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని కమల్‌నాథ్, గుజరాత్‌లో 40 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని శక్తిసింగ్ గోహిల్, దిల్లీలో 11 లక్షల బోగస్ ఓట్లను తొలగించాలని కేజ్రీవాల్ ఎన్నికల సంఘానికి గతంలో వినతులు అందజేశారు. ఇప్పుడు 'సర్' ప్రక్రియ చేపడుతుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని వీధుల్లోకి రావడం అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ఠ" అని పేర్కొన్నారు.




# చైనా మాంజాతో.. ప్రజల ప్రాణాలకు ముప్పు..

- నియంత్రణకు సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ పోరాటం..
- ప్రభుత్వం ఇకనైనా మేల్కొని మూలాలను నిర్మూలించాలని విజ్ఞప్తి..!

-5 లో

- సరదా మాటున దాగిఉన్న మృత్యుపాశం.. చైనా మాంజాతో ప్రాణాలకు ముప్పు..!
- సూరారం చౌరస్తాలో చైనా మాంజ వినియోగిస్తున్న యువకులకు అడ్డుకట్ట..
- రవీందర్ ముదిరాజ్ హెచ్చరిక..! అవగాహన కల్పించి పంపించిన పర్యావరణ ప్రేమికుడు..
- విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలి.. పోలీసులకు సామాజిక కార్యకర్త పిలుపు..!
- సర్పంచుల నుంచి కాలనీ సంఘాల వరకు.. చైనా మాంజా నిర్మూలనకు సమిష్టి పోరు..!
- తాత్కాలిక తనిఖీలు కాదు.. చైనా మాంజా విక్రయాలపై శాశ్వత నిషేధమే లక్ష్యం..!


పెన్ పవర్
శనివారం 10 అక్టోబర్ 2026
పెన్ పవర్
బౌరంపేట్ సర్వే నెం.578,580లో...
అక్రమ నిర్మాణాలు
2022 జూన్‌లో కూల్చినచోటే..! 2026 అక్టోబర్‌లో మళ్ళీ కబ్జాలు..
తాజాగా దాదాపు 6 బేస్మంట్‌లు- 2 గదుల నిర్మాణం.. అంతా బహిరంగమే..!
పట్టపగలే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులు..


ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం..

## బౌరంపేట్ అక్రమ నిర్మాణాలపై...

# రెవెన్యూ 'పంజా'..!

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**'పెన్ పవర్' వార్తా కథనానికి స్పందించిన ఎమ్మార్వో రాజేశ్వర్ రెడ్డి..**

**సర్వే నెం.578, 580లో 6 బేస్మంట్‌లు- 2 గదులు నేలమట్టం..**

- 2022 జూన్‌లో కూల్చినచోటే..! 2026 అక్టోబర్‌లో మళ్ళీ కబ్జాల పరంపర..
- 'పెన్ పవర్' దినపత్రికలో ఈనెల 10న శనివారం ప్రత్యేక కథనం..
- దుండిగల్-గండిమైసమ్మ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి చర్యలకు ఆదేశాలు..
- కూల్చివేతలకు వెళ్ళిన ఆర్ఐ రవికుమార్, జిపివో ప్రకాశ్..
- తాజాగా నిర్మించిన 6 బేస్మంట్‌లు- 2 గదుల నిర్మాణాలు కూల్చివేత..
- అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులపై చర్యలకు సిద్ధం..
- మరోవైపు సంబంధిత స్థలం 'టిజిహెచ్‌బి' స్థలంగా ఆరోపణలు..
- హౌసింగ్ బోర్డు అధికారులూ స్పందించి స్థలాన్ని పరిశీలించాలని స్థానికుల విజ్ఞప్తి..
- తక్షణ చర్యల్లో భాగంగా ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు సన్నద్ధం..
- రెవెన్యూ కూల్చివేతలపై హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు..
- ప్రస్తుతం కబ్జాకు పాల్పడిన ప్రభుత్వ స్థలం మొత్తం దాదాపు 3.5 ఎకరాలు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 12:** దుండిగల్-గండిమైసమ్మ మండలం, బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు.. శనివారం 'పెన్ పవర్' దినపత్రికలో వచ్చిన "బౌరంపేట్‌లో సర్వే నెంబర్:578, 580లో అక్రమ నిర్మాణాలు" అన్న కథనంతో వార్తను ప్రచురించగా..దుండిగల్ రెవెన్యూ అధికారులు స్పందించారు.. తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, స్థానిక జిపివో ప్రకాశ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది జేసిబితో వెళ్ళి ఇందిరమ్మ కాలనీలలో కూల్చివేతలు చేపట్టారు.. ఈ కూల్చివేతల్లో 6 బేస్మంట్ నిర్మాణాలు, 2 గదులు కూల్చివేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.. కబ్జాకు గురైన సర్వే నెంబర్ 578, 580 ప్రభుత్వ భూమి "తెలంగాణ హౌసింగ్ బోర్డు"(టిజిహెచ్‌బి)కి సంబంధించిన భూమిగా, కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ప్రస్తుతం కబ్జాకు గురైన భూమిలో దాదాపు 03-20 ఎకరాలు ఖాళీస్థలం ఉండవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు..


బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో జేసిబితో గదులు నేలమట్టం చేసిన దృశ్యం..

బౌరంపేట్ సర్వే నెం.578, 580 ప్రభుత్వ భూమిలో(కబ్జాకు గురైన వద్ద) సుమారు 03-20 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండవచ్చిన స్థానికులు ఆరోపిస్తుండగా..! సంబంధిత భూమి "టిజిహెచ్‌బి"కి చెందినదిగా పలువురు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.. ఇటు రెవెన్యూ, అటు టిజిహెచ్‌బి, అధికారులు సమన్వయంతో స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ లాంటి చర్యలు తక్షణమే చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.. మరోవైపు రెవెన్యూ అధికారులు కూల్చివేసిన అదేచోట మళ్ళీ నిర్మాణాలు చేపడితే, కబ్జాదారులపై కఠినమైన చర్యలు ఉంటాయని దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు..

## ఇదేచోట 2022లోనూ కబ్జా యత్నానికి బ్రేక్..

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని బౌరంపేట ఇందిరమ్మ కాలనీ సర్వే నెంబర్. 578, 580 ప్రభుత్వ భూమిలో సుమారు 4 ఏళ్ళక్రితం (2022 జూన్ 20న) జేసిబితో చదును చేసి దర్జాగా గదుల నిర్మాణం చేపడుతుండగా పత్రికల్లో వార్తలు వచ్చిన వెంటనే, అప్పటి రెవెన్యూ అధికారులు చేపట్టిన తక్షణ చర్యల్లో భాగంగా, కబ్జా పనులు నిలిచి పోయాయి.. ఇందిరమ్మ (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం) అపార్ట్‌మెంట్‌లు చాటు ఉండటంతో, 4-5 రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్ళలేదని అధికారులు పేర్కొన్నట్టు సమాచారం.. పెన్ పవర్ దినపత్రికలో శనివారం వార్త వచ్చినప్పటికీ.. రెండు రోజులు సెలవు దినాలు అయినందున, సంబంధిత అక్రమ నిర్మాణాలను సోమవారం కూల్చేసినట్టు తెలిపారు..


ఇటువైపు గదుల నిర్మాణం నుంచి బేస్మంట్‌ల వైపుకు తీసిన చిత్రం..


బేస్మంట్‌ల వైపునుండి నేలమట్టం చేసిన గదుల వైపు తీసిన దృశ్యం..




- సరదా మాటున దాగిఉన్న మృత్యుపాశం.. చైనా మాంజాతో ప్రాణాలకు ముప్పు..!
- సూరారం చౌరస్తాలో చైనా మాంజ వినియోగిస్తున్న యువకులకు అడ్డుకట్ట..
- రవీందర్ ముదిరాజ్ హెచ్చరిక..! అవగాహన కల్పించి పంపించిన పర్యావరణ ప్రేమికుడు..
- విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలి.. పోలీసులకు సామాజిక కార్యకర్త పిలుపు..!
- సర్పంచుల నుంచి కాలనీ సంఘాల వరకు.. చైనా మాంజా నిర్మూలనకు సమిష్టి పోరు..!
- తాత్కాలిక తనిఖీలు కాదు.. చైనా మాంజా విక్రయాలపై శాశ్వత నిషేధమే లక్ష్యం..!

# చైనా మాంజాతో.. ప్రజల ప్రాణాలకు ముప్పు..

- నియంత్రణకు సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ పోరాటం..
- ప్రభుత్వం ఇకనైనా మేల్కొని మూలాలను నిర్మూలించాలని విజ్ఞప్తి..!


చైనా మాంజాను కాల్చేస్తున్న సామాజిక కార్యకర్త రవిందర్ ముదిరాజ్..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 12:** పండుగల సందర్భంగా సరదాగా గాలిపటాలు ఎగురవేసేందుకు ఉపయోగిస్తున్న చైనా మాంజా.. అమాయకుల ప్రాణాలను బలిగొంటూ ప్రాణాంతకంగా మారుతోందని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవిందర్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు.. రహదారులపై ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారితో పాటు పాదచారుల మెడలకు చుట్టుకొని తీవ్ర గాయాలకు కారణమవుతున్న ప్రమాద ఘటనలు మనం చూశామని అన్నారు.. ఈ ప్రమాదకరమైన మాంజా వినియోగాన్ని అరికట్టేందుకు సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ నడుం బిగించారు.. చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, దాని వినియోగం, విక్రయాల నిర్మూలన కోసం ఆయన చేస్తున్న ప్రయత్నంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.. ఇద్దరు యువకులు చైనా మాంజాతో గాలిపటాలు ఎగురువేస్తున్నది చూసిని ఆయన వెంటనే వాళ్ళవద్ద ఉన్న మాంజాను మంటల్లో కాల్చేశారు..

## మాంజాపై ఇద్దరు యువకులకు అవగాహన..

సూరారం చౌరస్తాలో చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేస్తున్న ఇద్దరు యువకులను, సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ గుర్తించి అడ్డుకున్నారు.. ప్రమాదకరమైన మాంజా వినియోగం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వారికి వివరించి, అవగాహన కల్పించారు.. ఆ ఇద్దరు పాఠశాల విద్యార్థులు అయినందున, సరదాగా వారితో గుంజీలు తీయించారు.. యువత సరదా కోసం చేసే పని మరొకరి కుటుంబంలో తీరని విషాదాన్ని నింపకూడదనే ఉద్దేశంతో వారికి గుర్తు చేశారు.. ఇది కేవలం ఇద్దరు యువకులను అడ్డుకోవడమే కాకుండా, సమాజం మొత్తం చైనా మాంజా ప్రమాదాన్ని గుర్తించాలనే సందేశాన్ని ఇచ్చే ప్రయత్నంగా నిలిచింది..

## గతంలో ప్రమాద ఘటనలను వివరించిన రవిందర్..

గతంలో చైనా మాంజా కారణంగా ద్విచక్ర వాహనదారుల మెడలకు మాంజా చుట్టుకొని ప్రాణాలు కోల్పోయిన ఘటనలు, సైనిక ఉద్యోగి, పోలీసు కానిస్టేబుల్ సహా పలువురు ప్రమాదాలకు గురైన సందర్భాలు ప్రజల్లో ఆందోళన కలిగించాయని ఆయన గుర్తు చేశారు.. తాజాగా జీడిమెట్లలో మనీష్ అనే వ్యక్తి చైనా మాంజా కారణంగా తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైనట్లు రవిందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.. ఈ నేపథ్యంలో చైనా మాంజా వినియోగాన్ని అరికట్టడమే కాకుండా, దాని సరఫరా వ్యవస్థను గుర్తించి విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోలా రవీందర్ ముదిరాజ్ ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు..



## ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి..

చైనా మాంజా నిర్మూలన ఒక్క పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు సమిష్టిగా కృషి చేయాల్సిన సామాజిక బాధ్యత అని ఆయన స్పష్టం చేస్తున్నారు.. కేవలం పండుగల సమయంలో తనిఖీలకే పరిమితం కాకుండా, ఏడాది పొడవునా విక్రయాలపై నిఘా పెట్టాలని, సరఫరా కేంద్రాల గుర్తింపు, అవగాహన కార్యక్రమాలు, ఫిర్యాదులపై వేగవంతమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

ప్రాణాంతక చైనా మాంజా వల్ల మరో కుటుంబం కన్నీటి పర్యంతం కాకూడదనే సంకల్పంతో కోలా రవీందర్ ముదిరాజ్ చేస్తున్న ఈ ప్రయత్నానికి ప్రజల మద్దతు కూడా ఎంతో అవసరం.. సరదా కోసం ఎగిరే గాలిపటం.. మరొకరి జీవితాన్ని చిదిమేయకూడదు. చైనా మాంజా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలనే సందేశంతో ఆయన ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు.. ఈ కార్యక్రమంలో డీసీఎం రాజు, అనిల్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు..


సూరారం చౌరస్తాలో చైనా మాంజాతో కనిపించిన యువకులకు రవిందర్ అవగాహన..

## మాంజా నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం..

చైనా మాంజా విక్రయిస్తున్న వారి వివరాలు తెలిసినవారు, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, విక్రయ కేంద్రాల చిరునామాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, రవిందర్ ముదిరాజ్ ప్రజలను కోరారు.. అలా చేయడం ద్వారా ప్రమాదాల బారిన పడే అమాయకుల ప్రాణాలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చని ఆయన సూచిస్తున్నారు.. గ్రామాల పరిధిలో స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాలు, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని రవీందర్ పిలుపునిచ్చారు.. తమ పరిధిలో చైనా మాంజా విక్రయాలు, వినియోగం జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, అలాంటి కార్యకలాపాలు గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి చైనా మాంజా విక్రయించే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి, మాంజాను సరఫరా చేస్తుజన్న మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు...





రూ.20 లక్షలతో పట్టు బడిన అధికారి..

# రూ.20 లక్షల 'లంచం'తో..! ఏసీబీకి చిక్కిన "తహసీల్దార్-సర్వేయర్"!!

**•రూ.30 లక్షలు డిమాండ్..! రూ.20 లక్షలకు కుదిరిన బేరం..!**

**•హెచ్ఎండీఏ సర్వే నివేదికలో అవినీతి బాగోతం..!**

- అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి బట్టబయలు..
- రూ.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్ శ్రీనివాసులు..!
- తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి సూచనల మేరకే లంచం స్వీకరణ..!
- రూ.30 లక్షలు డిమాండ్.. రూ.20 లక్షలకు బేరం కుదుర్చుకున్న అవినీతి అధికారులు..
- లేఅవుట్ సర్వే, జాయింట్ ఇన్‌స్పెక్షన్ నివేదిక జారీకి లంచం..!
- రసాయన పరీక్షల్లో సానుకూల ఫలితాలు.. నగదు స్వాధీనం..!
- ఇద్దరు అధికారుల అరెస్టు.. ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలింపు..!

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 12:** తమ విధుల్లో భాగంగా నిర్వహించాల్సిన సర్వేకు, అధికారిక నివేదిక జారీ చేయడానికి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు రెవెన్యూ అధికారులు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కారు.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ బి.సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు రూ.20 లక్షల లంచం వ్యవహారంలో ఏసీబీ, సీఐయూ అధికారులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ఏసీబీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఏసీబీ పత్రికా ప్రకటన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడికి సంబంధించిన లేఅవుట్ విషయంలో హెచ్ఎండీఏ మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహించి, జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక జారీ చేయడానికి ఇద్దరు అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.. తొలుత రూ.30 లక్షలు డిమాండ్ చేయగా, అనంతరం ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు తగ్గించినట్లు ఏసీబీ వెల్లడించింది..

## లంచం తీసుకుంటుండగా పట్టుబడిన సర్వేయర్..

అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామం సమీపంలో మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 లక్షల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. తహసీల్దార్ బి.సుదర్శన్ రెడ్డి సూచనల మేరకు సర్వేయర్ ఈ మొత్తాన్ని స్వీకరించినట్లు ఏసీబీ తెలిపింది.. సర్వేయర్ వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, ఆయన రెండు చేతుల వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ వ్యవహారంలో ఇద్దరు అధికారులు తమ విధులను అవినీతికి తాకట్టు పెట్టారని పేర్కొన్నారు..

## అరెస్టు చేసి.. ప్రత్యేక కోర్టులో హాజరు..

ఈ కేసులో తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులును అరెస్టు చేసి, హైదరాబాద్ నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ తెలిపింది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని పేర్కొంది. ఫిర్యాదుదారుడి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయన వివరాలను వెల్లడించలేదని స్పష్టం చేసింది.. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106తో పాటు తెలంగాణ ఏసీబీ సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బాధితులు, ఫిర్యాదుదారుల పేర్లు, వ్యక్తిగత వివరాలను రహస్యంగా ఉంచుతామని ఏసీబీ భరోసా ఇచ్చింది.

---

## ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి.. కుటుంబానికి అండగా రేవంత్ సర్కారు

**హైదరాబాద్ పెన్ పవర్:**రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ వాసి కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా, హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతిచెందగా, అతడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు.

వివరాల్లోకి వెళితే, సుదర్శన్ గౌడ్ ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న యుద్ధంలో భాగంగా క్షిపణులు, డ్రోన్ దాడుల కారణంగా అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు, ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం, ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, సీఎం సహాయ నిధి (జవీ=ఖీ) నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేసేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# బీఆర్ఎస్ కు "భూమి" భారం

**హైదరాబాద్ పెన్ పవర్:**

తెలంగాణలో బీఆర్ఎస్ ఒకింత ఇబ్బంది కరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది. అధికారంలో ఉన్న సమయంలో భూముల కొనుగోళ్లు ఇప్పుడు కాంగ్రెస్ చర్చ పెట్టడంతో ఒకింత ఆత్మరక్షణలో పడినట్లయింది. కేసీఆర్ నుంచి ఆయన కుటుంబ సభ్యులపై భూ ఆక్రమణల ఆరోపణలను కాంగ్రెస్ చేయడంతో దీనిని అధిగమించేందుకు ఎదురుదాడికి దిగుతున్నప్పటికీ అనుకున్న ఫలితం లభించడం లేదు. రాజకీయంగా మరియు న్యాయపరంగా చూస్తే, బీఆర్ఎస్ పార్టీ భూముల వ్యవహారంలో తీవ్రమైన ఆత్మరక్షణలో పడిందనే చర్చ గట్టిగా నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, మరియు కీలక నేతల వ్యక్తిగత భూములపై గట్టి నిఘా పెట్టడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పాలి.తెలంగాణలో భూములన్నీ... బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ అక్రమాలు, 22–ూా కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 2026లో ఒక నలుగురు సభ్యుల ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది పార్టీ నేతలను



ఇరకాటంలోకి నెట్టింది. జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరలకు కేటాయించుకున్నారని, కొన్ని చోట్ల అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారనే ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు నడుస్తున్నాయి. ఇప్పటికే నల్గొండ వంటి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన పార్టీ ఆఫీస్ భవనాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో భూములను తమ సొంతం చేసుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలపడేందుకు దోహదపడింది. రాజకీయాలు కేసీఆర్ కుటుంబానికి చెందిన గజ్వేల్ ఫామ్‌హౌస్ భూములు, అలాగే కేటీఆర్‌కు లింక్ ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జన్వాడ ఫామ్‌హౌస్ పరిసర భూములపై కాంగ్రెస్ ప్రతినిధుల బృందాలు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపాయి. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో దాదాపు 440 ఎకరాల భూములు ఉన్నాయని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆరోపించి విచారణకు ఆదేశించారు. ఈ ఆరోపణ లన్నింటినీ రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా బీఆర్ఎస్ కొట్టిపారేస్తోంది. ప్రభుత్వ భూముల తాకట్టుపై కాంగ్రెస్‌ను నిలదీస్తూ, సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ భూములపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హరీశ్ రావు, కేటీఆర్ లాంటి అగ్రనేతలు ఎదురుదాడికి దిగుతున్నారు.అయినప్పటికీ, అధికారికంగా ప్రభుత్వ విచారణలు, కోర్టుల నోటీసులు ఎదుర్కొంటుండటం వల్ల భూముల విషయంలో ప్రస్తుతానికి బీఆర్ఎస్ కొంత ప్రతికూల పరిస్థితుల్లోనే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

**శ్రీ విద్యాంజలి కళాశాలలో ఆటపాటలతో విద్యార్థినుల సందడి**



ఇబ్రహీంపట్నంలోని శ్రీ విద్యాంజలి కళాశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, (అక్టోబర్ 12):** మండల కేంద్రంలోని శ్రీ విద్యాంజలి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు కలిసి తంగేడు, గునుగు, బంతి, నూకలు, జిల్లేడు, మందార, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంబురాల్లో పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన రాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల ప్రాంగణం పూల సౌందర్యంతో, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనిత కుమారి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర జీవన విధానానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలనే దైవంగా కొలిచే ఈ పండుగ మహిళల ఆత్మగౌరవాన్ని చాటుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి, ఐక్యతకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మహిళలకు కుటుంబంలో, సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం కల్పించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనిత కుమారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విద్యార్థినులు, అధ్యాపకులు సరస్వతి, శీలత, జాన్సీ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యావేత్త దుగ్గ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం



**హైదరాబాద్ , పెన్ పవర్ అక్టోబర్ 12:** హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ పబ్లిక్ గార్డెన్స్‌లో గల భగవాన్ మహావీర్ ఆడిటోరియంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యావేత్త దుగ్గ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-1 ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరై, దుగ్గ్యాల రామును శాలువాతో సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. విద్యా రంగంలో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు కొనియాడారు. ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, విద్యావేత్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ నిస్వార్థంగా సేవలందించిన దుగ్గ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం అందించడం సముచిత గుర్తింపు అని పేర్కొన్నారు. ఆయన సేవలు భవిష్యత్ తరాల ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. పురస్కార గ్రహీత దుగ్గ్యాల రాము మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన శారదా ఎడ్యుకేషనల్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, విద్యా రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, విద్యావేత్తలు, పలువురు మేధావులు పాల్గొని దుగ్గ్యాల రాముకు అభినందనలు తెలిపారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వేడి.. తెరపైకి మాదిగలు!

**హైదరాబాద్ అక్టోబరు 12 పెన్ పవర్:**
తెలంగాణలో ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ అంశం చర్చనీయాంశంగా మారింది. నవంబర్‌లో మూడు నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండటంతో, అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి శాసనమండలిలో తమ వర్గానికి తగిన ప్రాతినిధ్యం దక్కలేదంటూ మాదిగ సామాజిక వర్గం నుంచి వస్తున్న డిమాండ్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నవంబర్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. వివిధ సమాజిక సమీకరణాలను బేరీజు వేస్తోంది. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎన్నికలకోసం ఇద్దరినీ రెడ్డి సమాజిక వర్గానికి చెందిన నేతలనే కాంగ్రెస్ హైకమాండ్ ఎంపిక చేసింది. దీంతో గవర్నర్ కోటా స్థానాలను వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పద్మశాలీ వర్గానికి చెందిన ఒకరికి ఎమ్మెల్సీ స్థానంలో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మూడు స్థానాలలో కనీసం రెండు స్థానాలను బీసీ వర్గాలకే కేటాయించే అవకాశాలున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో మాదిగ వర్గ నాయకులు తమకు అవకాశం కల్పించాలంటూ ఒత్తిడి పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు శాసనమండలిలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభించలేదన్నది ఆ వర్గ నేతల ప్రధాన వాదన. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కోటా కింద ఎమ్మెల్సీలుగా అవకాశం పొందిన ఎం.ఎస్. ప్రభాకర్, గొరెటి వెంకన్న ఇద్దరూ కూడా మాల సామాజిక వర్గానికి చెందినవారేనని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అద్దంకి దయాకర్ వంటి ప్రముఖులకు మండలిలో అవకాశం కల్పించినప్పటికీ, ఆ స్థానం కూడా మాల వర్గానికే దక్కిందని మాదిగ సంఘాలు వివరిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో డి. రాజేశ్వర్ రావుకు అవకాశం దక్కినా, ఆయన ఆ తర్వాత పూర్తిగా క్రిస్టియన్ మైనారిటీ వర్గంలోకి మారారని, అలాగే కేసీఆర్ హయాంలో కడియం శ్రీహరి బైండ్ల కులానికి చెందినవారని కమ్యూనిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. తమ దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని, ఈసారైనా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటించాలని మాదిగ నేతలు బలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రేసులో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ. సంపత్ కుమార్, దొమ్మాట సాంమయ్య, ఇందిరా సింగపురం, దేవాని సతీశ్ మాదిగ తదితరులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రత్యేకించి, ఎంఆర్పీఎస్ ఉద్యమంతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉండి, కాంగ్రెస్‌లో సీనియర్ లీడర్‌గా సేవలందిస్తున్న దేవాని సతీశ్ మాదిగ తదితరులు తమకు అవకాశం ఇవ్వాలని గట్టిగా కోరుతున్నారు. మొత్తానికి, రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలు కేవలం పదవుల భర్తీగానే కాకుండా, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి సామాజిక న్యాయాన్ని నిరూపించుకునే అగ్నిపరీక్షగా మారాయి. మరి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం మాదిగల ఆకాంక్షలను ఏ విధంగా నెరవేరుస్తారనేది వేచి చూడాలి.

# అల్లిపురంలో రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తి!

## భక్తులకు ఉచిత వైద్య పరీక్షలు.. మంచినీరు, మజ్జిగ పంపిణీ





వెంకటేశ్వర స్వామి గుడి పదిష్ట సందర్భంగా ఉచిత వైద్య శిఖరాన్ని అందిస్తున్న శ్రీ గోంగూర వెంకటేశ్వర్లు

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 12:** ఖమ్మం నగర సమీపంలోని అల్లిపురంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం భూమిపూజ కార్యక్రమం సందర్భంగా ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు వైద్య సేవలు అందించడంతో పాటు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.

**భక్తుల ఆరోగ్యానికి ప్రాధాన్యం**

భూమిపూజ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, భక్తులకు అవసరమైన వైద్య సహాయం అందించారు. ఎండ, రద్దీ కారణంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. వైద్య సేవలతో పాటు తాగునీటి సదుపాయం కల్పించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

**సేవా కార్యక్రమంలో ప్రముఖుల భాగస్వామ్యం**

ఈ సేవా కార్యక్రమంలో ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత, బీజేపీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు శ్రీ గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జి.వి.) పాల్గొన్నారు. అలాగే సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ ఏడుకొండలు, ఖమ్మం నగర గౌడ సంఘం అధ్యక్షులు శ్రీ హనుమంతరావు, శ్రీ పువ్వల నాగేశ్వరరావు, శ్రీ రక్ష హాస్పిటల్ సిబ్బంది, శ్రీ రక్ష ఆరోగ్య యాత్ర సభ్యులు తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించార

**ప్రజారోగ్యమే లక్ష్యం.. ప్రజాసేవే ధ్యేయం!**

ప్రజలకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, భక్తులకు కనీస సదుపాయాలు కల్పించడం ద్వారా రెడ్‌క్రాస్ సొసైటీ తన సామాజిక బాధ్యతను చాటుకుంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# అందుకే జగన్ ఓడిపోయారు.. కూటమిపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి హాట్ కామెంట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** 2024 ఏపీ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నారని, ఆయన వల్లే బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించిన ఆయన ఏపీలో ఏం జరిగిందో చూడండి అంటూ అనుమానాలు రేకెత్తించేలా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగన్ ఎందుకు ఓడిపోయారు? టీడీపీ, జనసేన, బీజేపీ చేతుల కలపడం వల్లే కదా? అంటూ కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో ఏపీ ఎన్నికలపై మరోసారి వాడివేడి చర్చకు కోమటిరెడ్డి తెర తీశారని అంటున్నారు.

**స్థానిక ఎన్నికల వేళ కోమటిరెడ్డి కలకలం**

సీఈసీ టార్గెట్ గా కాంగ్రెస్ ఆందోళనలు చేస్తుండగా, రెండేళ్ల క్రితం నాటి ఎన్నికలలో కూడా అక్రమాలు జరిగియాన్న అభిప్రాయం కలిగేలా కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్ ప్రక్రియ నిర్వహించి భారీగా ఓట్లు తొలగించారని కోమటిరెడ్డి ఆరోపించారు. పశ్చిమబెంగాల్ లో మూడు సార్లు పనిచేసిన ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ నియోజకవర్గంలో 40 వేల ఓట్లు తొలగించి 4 వేల ఓట్లతో ఓడించారని, అదేవిధంగా తమిళనాడులో మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజకవర్గంలో 70 వేల ఓట్లు తొలగించి ఆయనను ఓడించారని ఆరోపించారు. ఈ క్రమంలోనే 2024లో ఏపీలో కూడా ఇలానే జరిగిందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించడాన్ని వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అవడానికి రెండు రోజుల ముందు ఈ వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి.



**2024లో సీఈసీ రాజీవ్ కుమార్**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించిన కోమటిరెడ్డి వ్యాఖ్యలను రాజకీయంలో భాగంగా చూస్తున్నప్పటికీ ఆయన 2024లో ప్రధాన ఎన్నికల కమిషనర్ కాదన్న విషయాన్ని విస్మరించడంపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2024లో ప్రధాన ఎన్నికల కమిషనర్ గా రాజీవ్ కుమార్ పనిచేశారని గుర్తు చేస్తున్నారు. విమర్శలు, ఆరోపణలు చేసే ముందు కోటమిరెడ్డి వంటి సీనియర్ నాయకులు వాస్తవాలు సరి చూసుకోవాలని టీడీపీ వర్గాలు మండిపడుతున్నాయి. 2025లో సీఈసీగా జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారని, ఏపీ ఎన్నికలతో ఆయనకు ఏం సంబంధమో మంత్రి కోమటిరెడ్డి చెప్పాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

**వైసీపీకి నైతిక బలం**

2024 ఎన్నికల్లో ఈవీఎంల కారణంగానే తాము ఓడిపోయామని ఇన్నాళ్లు చెబుతున్న వైసీపీకి తాజాగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలతో మరింత నైతిక బలం లభించినట్లైందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక ఎన్నికలలో ఈ వ్యాఖ్యలను ఆ పార్టీ తనకు అనుకూలంగా ప్రచారం చేసుకునే ప్రయత్నం చేయొచ్చని అంటున్నారు. దీనివల్ల ఇప్పటికిప్పుడు వైసీపీకి లాభం దక్కక పోయినప్పటికీ, భవిష్యత్తులో సీఈసీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఫలితాల బట్టి వైసీపీకి లాభనష్టాలు ఉంటాయని అంటున్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఓటమి.. కాంగ్రెస్ సీరియస్!

**.హైదరాబాద్ , అక్టోబరు 12 పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్టోబర్ 9న ముగిసిన ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు తెలిపిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూ) ఓటమి పాలైనట్లు సమాచారం. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ముఖ్యంగా ఏఐటీయూసీ మద్దతుతో బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) విజయం సాధించడం, అధికార పార్టీకి మింగుడుపడడం లేదు. ఈ పరిణామంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్లే ఆర్టీసీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కార్మికులను తమ వైపు తిప్పుకోవడానికి, అధికారంలో ఉన్నామనే ధీమాతో టీడబ్ల్యూయూని గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ కార్మికులను మమేకం చేయడంలో, స్థానిక సమస్యలపై స్పందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్మిక సంఘం ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల ఆయన నేతల తీరును తప్పుబట్టారు. అక్టోబర్ 17న అధికారికంగా వెలువడనున్న ఈ ఎన్నికల తుది ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో ఎదురుకాబోయే సవాళ్లకు అద్దం పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఆర్టీసీ కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. కార్మిక రంగంలో పట్టుకోల్పోవడం భవిష్యత్తు రాజకీయాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన పార్టీ అధిష్టానంలో వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కొరవడుతోందనడానికి ఈ ఘటనే నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు కేవలం పదవులకే పరిమితమై పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పార్టీ గట్టి సంకేతాలు పంపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం అంతర్గత ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై, బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఆర్టీసీ ఎన్నికల వేడి తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరును, నాయకుల పనితీరులోని లోపాలను బట్టబయలు చేసిందనే చెప్పాలి.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి వార్నింగ్ బెల్స్!?**

తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఊహించినదానికి భిన్నంగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టబలపరిచిన యూనియన్లకు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపించే ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి చవిచూడడం పట్ల పార్టీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇవి వార్నింగ్ బెల్స్ లాంటివని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా వ్యతిరేకతకు ఇవి అద్దం పడుతున్నాయని, అప్రమత్తం కాకపోతే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాము మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ కూటమి విజయం సాధించాలని భావించింది. అయితే... సీపీఐ బలపరిచిన ఎంప్లాయీస్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. రాష్ట్ర స్థాయిలో క్లాస్-3 విభాగంలో సీపీఐ అనుబంధ యూనియన్ అయిన ఎంప్లాయీస్ యూనియన్ 18,250 ఓట్లను సాధించగా, కేవలం 13,670 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఎంప్లాయీస్ యూనియన్ సుమారు 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అలాగే ప్రాంతీయ స్థాయిలో క్లాస్-6 విభాగంలో 13,907 ఓట్లను సాధించింది. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్లకే పరిమితం కాలేదు.. రాజకీయంగా ఇది అధికార పార్టీకి పెద్ద హెచ్చరికగా మారింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ మద్దతు కూటమి కేవలం 3 యూనిట్లను మాత్రమే గెలవడం పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనకపోవడం, కొందరు నేతలు ప్రత్యర్థి యూనియన్లకు మద్దతు ఇవ్వడం వంటి ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలను బయటపెడుతున్నాయి. అక్టోబర్ 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరగనుండగా, అక్టోబర్ 17న అధికారిక తుది ఫలితాలు వెలువడనున్నాయి. అయితే మొత్తం 900 లోపే ఉన్న పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటికే ఉన్న 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని మార్చలేవని స్పష్టమవుతోంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను పునరాలోచనలో పడేశాయి. అనుబంధ సంఘాలతో సమన్వయం, ఆర్టీసీ ఉద్యోగులతో నిరంతర సంప్రదింపులపై పార్టీ నాయకత్వం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సడలుతుందనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ తన యంత్రాంగాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బంగారం కోసం బాంబుల వర్షం.. సూడాన్ సరిహద్దులో జరిగిన దారుణం



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం.. ప్రపంచవ్యాప్తంగా దేశాల ఆర్థిక వ్యవస్థలకు కీలకమైన లోహం. కానీ అదే బంగారం ఇప్పుడు రెండు పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతోందా? సూడాన్–ఈజిప్ట్ సరిహద్దులో చోటుచేసుకున్నట్లు చెబుతున్న వైమానిక దాడులు ఈ ప్రశ్నను మరోసారి తెరపైకి తెచ్చాయి. సరిహద్దు ప్రాంతంలోని బంగారు గనులపై ఈజిప్ట్ ఫైటర్ జెట్లతో దాడులు చేసిందని సూడాన్‌కు చెందిన మానవ హక్కుల సంఘాలు ఆరోపించాయి. ఈ దాడుల్లో 72 మంది మరణించినట్లు పేర్కొన్నాయి. అయితే ఈ ఘటనపై ఈజిప్ట్ ఇంత వరకూ స్పందించలేదు.

**బంగారు గనుల చుట్టూ వివాదం**

సూడాన్, ఈజిప్ట్ మధ్య సరిహద్దు వివాదం కొత్తది కాదు. ముఖ్యంగా హలైబ్ ట్రయాంగిల్ ప్రాంతం చాలా కాలంగా ఇరు దేశాల మధ్య విభేదాలకు కేంద్రంగా ఉంది. ఈ ప్రాంతంపై రెండు దేశాలకూ హక్కుల విషయంలో భిన్నమైన వాదనలు ఉన్నాయి. భౌగోళికంగా కీలకమైన ఈ ప్రాంతం సహజ వనరుల పరంగానూ ప్రాధాన్యం కలిగి ఉంది. ఇక్కడి బంగారు గనుల విషయంలోనూ వివాదాలు కొనసాగుతున్నాయి. హలైబ్ ట్రయాంగిల్ ప్రాంతంలో సూడాన్‌కు చెందిన వ్యక్తులు అక్రమంగా బంగారం తవ్వుతున్నారని ఈజిప్ట్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే గనులను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు జరిగినట్లు సూడాన్ మానవ హక్కుల సంఘాలు చెబుతున్నాయి. అయితే దాడుల్లో 70 మంది వరకూ చనిపోయినట్లు సమాచారం. దీంతో ప్రపంచవ్యాప్తగా దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.

**సహజ వనరులే సంఘర్షణలకు కారణమవుతున్నాయా?**

ప్రపంచవ్యాప్తంగా చమురు, బంగారం, ఖనిజ సంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లో భూభాగ హక్కులు, వనరుల నియంత్రణ వంటి అంశాలు తరచూ వివాదాలకు దారితీస్తుంటాయి. బంగారు గనుల ద్వారా లభించే ఆదాయం స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడటమే కాకుండా అక్రమ తవ్వకాలు జరిగితే భద్రతాపరమైన సమస్యలకూ కారణమవుతుంది. సూడాన్–ఈజిప్ట్ సరిహద్దులోని తాజా ఘటనపై వచ్చిన ఆరోపణలు కూడా ఈ కోణంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవైపు సరిహద్దు నియంత్రణ, మరోవైపు సహజ వనరులపై ఆధిపత్యం.. ఈ రెండు అంశాలు కలిసినప్పుడు ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది.

**72 మంది మృతి.. ఇంకా స్పష్టత రావాల్సిందే!**

ఫైటర్ జెట్ల దాడుల్లో 72 మంది మరణించారన్నది ప్రస్తుతం సూడాన్‌కు చెందిన మానవ హక్కుల సంఘాలు వెల్లడించిన సమాచారం. ఈజిప్ట్ అధికారికంగా స్పందించకపోవడంతో పీఠముడి నెలకొంది. మరోవైపు సరిహద్దు వివాదం మరింత ముదిరితే దాని ప్రభావం స్థానిక ప్రజల భద్రతతో పాటు ఇరు దేశాల సంబంధాలపైనా పడే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆరోపణలపై పారదర్శక విచారణ, వాస్తవాల నిర్ధారణ, దౌత్యపరమైన చర్చలు కీలకంగా మారనున్నాయి.

**బంగారం విలువ కంటే ప్రాణాల విలువ ముఖ్యం**

బంగారు గనులపై ఎవరి నియంత్రణ ఉండాలన్నది రాజకీయ, భౌగోళిక అంశం కావచ్చు. కానీ అలాంటి వివాదాలు ప్రాణనష్టానికి దారితీస్తే మానవతా కోణం ముందుకు వస్తుంది. సూడాన్–ఈజిప్ట్ సరిహద్దులో 72 మంది మరణించారన్న ఆరోపణలు నిజమైతే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. సహజ వనరులపై హక్కుల వివాదాలకు సైనిక చర్యలే పరిష్కారమా? లేక చర్చలు, ఒప్పందాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చా? ఈ ప్రశ్నలకు ఇరు దేశాల తదుపరి స్పందనలే సమాధానం చెప్పనున్నాయి.

# రాయలసీమలో మూడు కార్పొరేషన్లు.. వైసీపీలో కొత్త ఆశలు



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక ఎన్నికలపై వైసీపీలో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రత్యక్ష విధానంలో మేయర్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు అనుకూలిస్తుందని వైసీపీ సీనియర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలోని వైసీపీ పునాదులు బలంగా ఉన్న నగరాలు, పట్టణాల్లో తమ సత్తా చాటుతామని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపుతో 2024 అసెంబ్లీ ఎన్నికల ఓటమిని అధిగమించాలని భావిస్తోంది. దీంతో అంతర్గతంగా పెద్ద కసరత్తే చేస్తోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా గెలుపు అవకాశాలను విశ్లేషిస్తూ కార్యకర్తల నుంచి వివరాలు సేకరిస్తోంది.

రాష్ట్రంలో 17 కార్పొరేషన్లు ఉండగా, రాయలసీమలోని 3 కార్పొరేషన్లపై వైసీపీలో పూర్తిస్థాయిలో ధీమా వ్యక్తమవుతోందని చెబుతున్నారు. దాదాపు ప్రతి చోటా గట్టి పోటీ ఇచ్చినప్పటికీ ఆ మూడు చోట్ల అధికార కూటమి కంటే తాము మెరుగ్గా ఉన్నామని వైసీపీ నేతలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాయలసీమ ప్రాంతంలోని మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తమ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బలంగా ఉందన్న ప్రచారం నేపథ్యంలో రాయలసీమలోని మూడు కార్పొరేషన్లు, పలు మున్సిపాలిటీలపై వైసీపీలో కనిపిస్తున్న ధీమా రాజకీయంగా ఆసక్తి రేపుతోందని అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత ఇలాకా అయిన కడప నగరపాలక సంస్థతోపాటు పక్కనే ఉన్న కర్నూలు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లను సునాయాశంగా గెలుచుకుంటామని వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. ఈ మూడు చోట్ల ఎమ్మెల్యేల పనితీరు, కూటమిలో అంతర్గత కలహాలు తమకు మేలు చేస్తాయని భావిస్తున్నారు.

కడపలో స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డిని టీడీపీ నాయకులే వ్యతిరేకిస్తున్నారని, పైగా ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓట్లు తమకు కలిసి వస్తాయని ఊహిస్తున్నారు. ఇక కర్నూలు, తిరుపతిలో బలమైన కేడర్ సహకారంతో ఈజీగా గట్టెక్కుతామని వైసీపీ నాయకులు ధీమాగా ఉన్నారని చెబుతున్నారు. కర్నూలులో కూడా మైనార్టీ ఓట్లు భారీగా ఉండటంపై వైసీపీ నేతలు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. వీటికి తోడు తమకు సంస్థాగతంగా ఉన్న బలం కూడా తమకు గెలుపు అవకాశాలను మెరుగు పరిచే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంతేకాకుండా కర్నూలు నగరం పరిధిలో ఉన్న కొడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం కూడా కలిసివస్తుందని అంటున్నారు.

మరోవైపు తిరుపతి విషయంలోనూ వైసీపీలో ధీమా కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే భూమన వంటి బలమైన నేత తమకు అడ్వాంటేజ్ అవుతారని వైసీపీ భావిస్తోంది. భూమన స్థాయి నేత కూటమిలో లేకపోవడం కూడా తమకు కలిసివస్తుందని అంటున్నారు. తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే స్థానికేతరుడు కావడం, టీడీపీకి గత రెండేళ్లుగా ఇంచార్జి లేకపోవడం వల్ల వైసీపీ దూకుడు ఎక్కువగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇవన్నీ వైసీపీ కలలు కంటోందని రాష్ట్రంలో తమ బలం మరింత పెరిగిందని కూటమి నేతలు కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి రాయలసీమలోని మూడు కార్పొరేషన్లపై వైసీపీ చూపిస్తున్న ఉత్సాహం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

# విజయ నగరంలో వైసీపీకి వరస దెబ్బలు

**విజయనగరం, ,అక్టోబరు 12 పెన్ పవర్:** విజయనగరం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా కీలక నేతలను కోల్పోతూ భారీ షాక్‌లను ఎదుర్కొంటోంది. ఇటీవలే పార్టీ సీనియర్ నేత, బొత్స సత్యనారాయణ బంధువు అయిన మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయగా, ఆయన వెంటే పలువురు జడ్పీటీసీలు కూడా పార్టీని వీడారు. ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే పార్టీకి చెందిన మరికొందరు ముఖ్య నేతలు వరుసగా రాజీనామాలు చేస్తుండటంతో జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, విజయనగరం జడ్పీ మాజీ చైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. పార్టీ అధిష్ఠానం ఆయనను సస్పెండ్ చేసిన కొన్ని గంటల్లోనే ఆయన తన రాజీనామాను ప్రకటించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని, పార్టీని ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మార్చేశారని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మరొకవైపు కోలగట్ల వీరభద్రస్వామి కూడా పార్టీ మారతారని వినిపించినా ఆయన ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు. తాను కొంత కాలం నుంచి విశాఖలో ఉన్నంత మాత్రాన పార్టీని వీడుతారన్న ప్రచారం సరైనది కాదని ఆయన కొట్టిపారేశారు. తనకు ఇప్పుడు అరవై ఐదేళ్లని, తాను ఇప్పుడు పార్టీ మారి ఏం చేస్తానని ఆయన నవ్వుతూ అనడం కూడా చర్చనీయాంశమైంది. అయితే గతంలో అధికారంలో ఉన్నప్పుడు తన కుమార్తెను మేయర్ పదవికి పోటీ చేయాలని ప్రయత్నించి, ఇప్పుడు ఓటమి చెందిన తర్వాత తాము కొత్తవారికి అకాశం ఇవ్వాలని కోలగట్ల అనడం చర్చనీయాంశమైంది. కోలగట్ల వీరభద్రస్వామి నిజానికి పార్టీని వీడకపోవచ్చు. ఆయన వైసీపీలో ఉండే అవకాశాలు ఉండి ఉండవచ్చు. కానీ ఆయన సమావేశంలో మాట్లాడిన తీరు మాత్రం వైసీపీ నేతలు ఎవరైనా వెళితే సాధారణమేనని కొట్టిపారేయడం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బెల్లం ఉన్న చోటకే ఈగలు ముసురుతాయని, గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నుంచి అనేక మంది నేతలు తమ పార్టీలోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ అన్న మాటలు తాను ఎవరు పార్టీని వదిలి వెళ్లినా పట్టించుకోనని మాత్రమే చెప్పినట్లయింది. .. కేవలం విజయనగరం ప్రాంతంలోనే కాదు. బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లో భారీ చేరికలు టీడీపీ, జనసేనలో ఉంటాయన్న ప్రచారం నడుస్తుంది. అక్టోబర్



మొదటి వారంలో బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పార్టీకి గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కళా వెంకటరావు సమక్షంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ లో చేరారు. జిల్లాలోని పలు మండలాల్లో ఒకేరోజు వందలాది కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి దూరమై కూటమి పార్టీల వైపు మొగ్గు చూపుతుండటంతో విజయనగరంలో వైఎస్సార్‌సీపీ మరింత బలహీనపడుతోంది. ఇక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కువ మంది ద్వితీయ శ్రేణి నేతలు వైసీపీకి దూరమవుతారన్న ప్రచారం జరుగుతోంది. బొత్స సత్యనారాయణవంటి సీనియర్ నేతలున్న ఈ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నేతలు దూరమవుతుండటంతో కొంత ఇబ్బందికరమైన పరిణామమే. అయితే నేతలు వెళ్లినంత మాత్రాన ఓటు బ్యాంకు మాత్రం చెక్కు చెదరదన్న ధీమాలో వైసీపీ నేతలున్నారు. మరి ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది చూడాలి. స్థలాలు చూడండి

# పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి టీమ్స్

**కొవ్వూరు అక్టోబరు 12 పెన్ పవర్:** తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో పెద్దపులి సంచారం స్థానికంగా కలకలం సృష్టించింది. దేచర్ల సమీపంలోని క్వారీ వద్ద పెద్దపులి తిష్ట వేయడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆ క్వారీ వద్దే సేదతీరుతున్న పులిని ఎలాగైనా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పులిని బంధించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. పులికి ఎలాంటి హాని కలగకుండా, అలాగే సిబ్బందికి ప్రమాదం జరగకుండా దాన్ని బంధించేందుకు అటవీ శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కొవ్వూరు ప్రాంతంలో పులి సంచారం దృష్ట్యా స్థానిక ప్రజలు, సమీప గ్రామాల రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది. గోదావరి జిల్లాలో పెద్దపులి దోబూతులాడుతోంది. చాలా రోజులుగా అటవీ శాఖను ముప్పుతిప్పలు పెడుతున్న పులి.. ఇప్పుడు చాగల్లు అరటితోటల్లో సంచరిస్తోంది. కొన్నాళ్లుగా పాపికొండల అభయారణ్యంలో తిరిగిన పులి కొన్ని రోజుల కిందట సీతానగరం వద్ద గోదావరి నదిని దాటింది. దేవరపల్లి మీదుగా ఇప్పుడు డెల్టా ప్రాంతానికి వచ్చేయడంతో అటవీ అధికారుల్లో ఆందోళన పెరిగింది. పులిని సాధ్యమైనంత త్వరగా బంధించేందుకు పూణె నుంచి ప్రత్యేక టీమ్‌ను రప్పించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పులి చాగల్లు సమీపంలోని ఓ అరటితోటలో రైతులకు కనిపించింది. ఆ తర్వాత ఓ ఫ్యాక్టరీ సమీపంలో పులి సేదతీరుతున్నట్లు కెమెరాలకు చిక్కింద. పులి అనుసరిస్తున్న వ్యూహం అటవీశాఖ అధికారులను ఆశ్చర్యపరుస్తోంది. పగటిపూట కోకో తోటలు, వరి పొలాల్లో నక్కుతూ, చీకటి పడగానే ఊర్లు మారుతూ హడలెత్తిస్తోంది. పులి కదలికలను అటవీ శాఖ అధికారులు ఛాలెంజ్‌గా తీసుకుని.. రేడియో కాలర్ సిగ్నల్స్, ప్రత్యేక డ్రోన్ కెమెరాల ద్వారా దాని జాడను ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక మత్తు ఇంజెక్షన్ నిపుణుల బృందం కూడా పులిని బంధించే ఆపరేషన్‌లోకి దిగింది. పూణె టీమ్ మాత్రం సాధ్యమైనంత త్వరగా పులిని పట్టుకుంటామని చెప్పి ఒకరోజు పూర్తయిందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

## ఎమ్మెల్యే బాలరాజు సెటిల్మెంట్

**పవన్ కల్యాణ్ సీరియస్.. అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశం**

**పోలవరం,అక్టోబరు 12 పెన్ పవర్:** పోలవరం జనసేన ఎమ్మెల్యే బాలరాజు సెటిల్మెంట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీరులో ఎలాంటి మార్పు రాలేదని, తాజాగా ఆయనపై ఇసుక మరియు మట్టి అక్రమ రవాణా సెటిల్‌మెంట్ల ఆరోపణలు రావడంతో పాటు దానికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు రావడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. విచారణ కోసం హై లెవెల్ కమిటీని నియమించారు. గతంలో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై అనేక ఆరోపణలు రావడంతో పవన్ కల్యాణ్ పిలిచి క్లాస్ పీకారు. తాను అమాయకుడినని, తనకు ఏ పాపం తెలియదని బాలరాజు పవన్ ముందే నటించే ప్రయత్నం చేశారు. అయితే పవర్ స్టార్‌అయిన పవన్ కల్యాణ్ హెచ్చరికలు జారీ చేసి బాలరాజును పంపేశారు. హీరో ముందే నటనలా? అంటూ సొంత పార్టీ నేతలే బుగ్గలు నొక్కుకున్నార... తాజాగా మరొక వీడియా వైరల్ అవుతుండటంతో ఆయన ఇక తప్పించుకునే వీలు లేకుండా పోయింది సెటిల్‌మెంట్ చేస్తూ లక్షల రూపాయలు పంచి పెడుతున్న బాలరాజు వైఖరిపై సొంత పార్టీ నేతలే ఈ వీడియో ను లీక్ చేసినట్లు అర్థమవుతుంది. ఆయన ఇంట్లో నింపాదిగా స్థానిక నాయకులతో కలసి టీ తాగుతూ సెటిల్ మెంట్ చేస్తున్న వీడియో ఎమ్మెల్యే పరిస్థితికి అద్దం పడుతుంది. స్థానిక నాయకుల మధ్య ఇసుక, మట్టి అక్రమ రవాణా పంపకాల గొడవలు వీధికెక్కగా, స్వయంగా ఎమ్మెల్యే బాలరాజు లక్షలాది రూపాయల 5 లక్షల నుండి రూ. 21 లక్షల వరకు డీలింగ్స్ గురించి మాట్లాడిన ఆడియోతో కూడిన వీడియో బయటపడింది. ఎవరెవరికి ఎంత ఇవ్వాలని బాలరాజు చెప్పడం కూడా వీడియోలో వినిపించడంతో పార్టీ పరువు పోలవరం ప్రవాహంలా ఆ ప్రాంతంలో పారినట్లయింది. చిర్రి బాలరాజు తాజా వీడియో బయటకు రావడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కమిటీని నియమించారు. ఎమ్మెల్యే వ్యవహారశైలిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు పార్టీ తరఫున ఒక హైలెవల్ కమిటీని కూడా నియమించారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు రాగా, తాజాగా వెలుగు చూసిన ఇసుక పంచాయితీ వీడియోలు జనసేన పార్టీకి తలనొప్పిగా మారాయి. చిర్రి బాలరాజు వరసగా ఇలా వివాదాల్లో చిక్కుకోవడం, ఆయనకు సొంత పార్టీ లోనే శత్రువులు ఎక్కువగా ఉండటంతో తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. బాలరాజు ఇప్పుడు ఏం వివరణ ఇచ్చుకుంటారో తెలియదు కానీ, ఆయనకు మాత్రం పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో మరోసారి టిక్కెట్ ఇవ్వరన్న అభిప్రాయం పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతుంది. ఇంత బహిరంగంగా దోపిడీ చేస్తున్న వ్యవహారాన్ని పవన్ కల్యాణ్ సీరియస్ గా తీసుకున్నారని, అయితే స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు ఉండకపోయినా.. భవిష్యత్ లో మాత్రం బాలరాజుకు రాజకీయంగా ఇబ్బందులు తప్పవంటున్నారు.

ఎమ్మెల్యే భార్య పెత్తనం

దీనికి తోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే భార్య ఒక పార్టీ నాయకుడిపై దాడి చేయించారన్న ఆరోపణలు రావడం, సీనియర్ నేతలను, జనసైనికులను పక్కనపెట్టి పెత్తనం చెలాయిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పవన్ తీవ్ర అసహనానికి గురయ్యారు. అడవితల్లి బాట పేరిట పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పవన్‌ను ఆగ్రహానికి గురిచేసింది. తాజాగా నియమించిన హైలెవల్ కమిటీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ

**ఈ 14, 15 తేదీల్లో నోటిఫికేషన్.. నవంబర్ 30 లోపు ప్రక్రియ పూర్తి**

**అమరావతి,అక్టోబరు 12 పెన్ పవర్:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేబినెట్ భేటీలో బీసీలకు రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపులపై కీలకంగా చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం కానుందని తెలుస్తోంది. ఈ నెల 14 లేదా 15న ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 3 దశలలో నవంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ భేటీ ముగిసిన తరువాత మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలన వచ్చేలా చూద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 100శాతం గెలవాలని ఆకాంక్షించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని, చురుకుగా వ్యవహరిస్తూ వారి విజయం సాధించేలా చూసుకోవాలని సూచించారు. ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ, వారి రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెడికేటెడ్ బీసీ కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్) సమర్పించిన నివేదిక, సిఫార్సులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కొత్త నిర్ణయం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు లభించే స్థానాలు పెరగనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో కేవలం 33 వేల మంది బీసీలకు మాత్రమే అవకాశాలు దక్కగా, ప్రస్తుత నిర్ణయంతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో దాదాపు 38 వేల మందికి పైగా బీసీ ప్రజాప్రతినిధులకు పదవులు దక్కనున్నాయి. బీసీలకు గతంలో కంటే సుమారు 4 వేలకు పైగా స్థానాలు రగనున్నాయి. జిల్లాలు, వార్డులు, డివిజన్ల పునర్విభజనతో పాటు పెంపును పరిగణనలోకి తీసుకుని, జనాభా ప్రాతిపదికన ఈ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు మినహా ఇతర అన్ని విభాగాల పరిధిలోని దాదాపు 1.40 లక్షలకు పైగా స్థానాల్లో బీసీ రిజర్వేషన్లను వర్తింపజేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. స్థానిక చట్టాలు, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండానే బీసీలకు గరిష్ట స్థానాల్లో పోటీ చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. అంతేకాకుండా, సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించకుండా డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. దీని ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా పక్కాగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఏవైనా కేటగిరీలలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం కంటే తక్కువగా ఉంటే, కూటమి పార్టీల తరఫున ఆయా పదవులను బీసీలకే కేటాయిస్తామని చంద్రబాబు ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# క్యూబాలో మందుల కొరత.. ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థలు




క్యూబాలో మందుల కొరత తీవ్రం కావడంతో ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తున్నాయి. రాజధాని హవానాలోని వెదాడో ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ భవనం వద్ద ప్రతి గురు, ఆదివారాల్లో మధ్యాహ్నం డజన్ల కొద్దీ ప్రజలు గుమిగూడుతున్నారు. లారా మెండోజా అనే మహిళ కిందకు వచ్చి, మందుల కోసం వచ్చిన వారి పేర్లను జాబితాతో సరిపోల్చి, వాట్సాప్ ద్వారా కోరిన మందులను అందజేస్తున్నారు. ఇందుకు ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదు.'మందులు అమ్మకానికి కాదు' పేరుతో మెండోజా చేపట్టిన ఈ కార్యక్రమం.. క్యూబాలో మందులు దొరక్క ఇబ్బందులు పడుతున్న వారికి ప్రాణాధారంగా మారింది. దేశ ఆర్థిక సంక్షోభం ముదరడంతోపాటు జనవరి నుంచి అమెరికా విధించిన ఇంధన, ఆర్థిక ఆంక్షలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ప్రభుత్వ ఫార్మసీల్లో మందులు దొరక్కపోవడంతో ఆన్‌లైన్ విక్రేతలు, వీధి వ్యాపారులు, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు ఆ కొరతను కొంతవరకు తీరుస్తున్నాయి. దశాబ్దాలుగా ప్రభుత్వ ఫార్మసీలే ప్రజలకు రాయితీ ధరలకు మందులు అందించే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి.కొరత తీవ్రం కావడంతో ప్రైవేటు ఫార్మసీల ఏర్పాటుకు అనుమతిస్తూ క్యూబా ప్రభుత్వం జులైలో నిబంధనలు తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆరోగ్య వ్యవస్థలో ఇది చారిత్రక మార్పు. దేశ ఆర్థిక వ్యవస్థలో విస్తృత సంస్కరణల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ప్రైవేటు ఫార్మసీలు అందుబాటులోకి వచ్చే వరకు మెండోజా వంటి వారి కార్యక్రమాలే ప్రజలకు అండగా నిలుస్తున్నాయి."హవానాలో మాకు ఐదు వాట్సాప్ గ్రూపులున్నాయి. ఇటీవల నగర శివార్లలోని గ్వానాబోలోనూ ఒక గ్రూపును ప్రారంభించాం" అని మెండోజా చెప్పారు. హవానాలో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు దాదాపు 100 వరకు ఉంటాయని ఆమె అంచనా వేశారు.కాథలిక్ సేవా సంస్థ కారిటాస్ సహకారంతో ఆమె కార్యక్రమానికి ప్రతి వారం 13 కిలోలకుపైగా మందులు అందుతున్నాయి. కెనడా, అమెరికాలోని మానవతా సంస్థలు, విరాళాలతో ప్రయాణించే వారు, స్థానికులు వీటిని సమకూరుస్తున్నారు. "ప్రజలు ఈ ఒక్క మందుల కేంద్రంపైనే ఆధారపడటం లేదు. ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారు" అని మెండోజా తన అపార్ట్‌మెంట్‌లోని మందుల అల్మారాల పక్కన నిలబడి చెప్పారు.మందులు తీసుకురాలేని రోగులకు స్వచ్ఛంద కార్యకర్తలు వాటిని ఇళ్లకు తీసుకెళ్లి అందిస్తున్నారు. అయితే ఫ్రిజ్‌లో ఉంచాల్సిన కొన్ని మధుమేహ మందులు, క్యాన్సర్ చికిత్సకు అవసరమైన ఔషధాలు దొరకడం చాలా కష్టంగా మారింది. వైద్యశాలల్లోనూ సరఫరాలు సరిగా లేకపోవడంతో రోగులు గాజు గుడ్డలు, సిరంజీలు, మత్తు మందుల కోసం వెతుకుతున్నారు.

**ప్రభుత్వ ఫార్మసీల్లో మూడో వంతు మందులే అందుబాటులో...**

"ఆరేడేళ్ల క్రితం ప్రభుత్వ ఫార్మసీల్లో మందులు సులభంగానే దొరికేవి" అని 27 ఏళ్ల భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు క్రిస్టినా డియాజ్ చెప్పారు. ఓ బంధువు కోసం క్లోనాజెపామ్ మందు తీసుకునేందుకు ఆమె మెండోజా కేంద్రానికి వచ్చారు. కొరత పెరిగే కొద్దీ మందులు దొరకడం మరింత కష్టమైందని తెలిపారు.క్యూబా ఆరోగ్య శాఖ ప్రాథమిక ఔషధాల జాబితాలో 603 మందులను చేర్చింది. ప్రస్తుతం వాటిలో మూడో వంతు కంటే కొద్దిగా ఎక్కువ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ జాబితాలోని దాదాపు 400 మందులను దిగుమతి చేసుకున్న ముడి పదార్థాలతో క్యూబా ప్రయోగశాలలు తయారు చేస్తున్నాయి.ప్రభుత్వ ఔషధ సంస్థ బయోక్యూబాఫార్మా అధ్యక్షురాలు మైదా మౌరీ పెరెజ్ జూన్‌లో కీలక వివరాలు వెల్లడించారు. సంస్థ సరఫరా చేయాల్సిన 395 మందుల్లో దాదాపు 300 మందులను దిగుమతి చేసుకునే ముడి పదార్థాల కొరత కారణంగా తయారు చేయలేకపోయామని చెప్పారు.మధ్య క్యూబాలోని సియెగో డి అవిలా ప్రావిన్స్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడి ప్రభుత్వ ఫార్మసీల్లో ప్రాథమిక జాబితాలోని మందుల్లో సుమారు 10 శాతం మాత్రమే ఉన్నాయని అధికారులు ఇటీవల అంగీకరించారు. సరఫరా, రవాణా సమస్యలతోపాటు ఇంధన కొరత కూడా ఇందుకు కారణమని తెలిపారు."క్యూబాలో ఔషధ తయారీ పరిశ్రమ బలంగా ఉందని మేం భావిస్తున్నాం. కానీ అవసరమైన సరఫరాలు లేకపోతే అత్యంత సమర్థంగా పనిచేసే కర్మాగారం కూడా తయారీ ప్రక్రియను పూర్తి చేయలేదు" అని ఆ ప్రావిన్స్ ఫార్మసీ సంస్థ అధిపతి మారియా ఫెర్నాండెజ్ మార్టినెజ్ అధికారిక పత్రిక గ్రాన్మాకు చెప్పారు.మందులను ప్యాక్ చేసేందుకు అవసరమైన బ్లిస్టర్ ప్యాక్‌లు, సీసాలు వంటి వాటి కొరత కూడా ప్రభుత్వాన్ని వేధిస్తోంది. దిగుమతుల కోసం చెల్లింపులు చేయడంలో అమెరికా ఆర్థిక ఆంక్షలు ఇబ్బందులు సృష్టిస్తున్నాయని క్యూబా చెబుతోంది. క్యూబా ఓడరేవులకు నౌకలను పంపితే అమెరికా జరిమానాలు విధిస్తుందనే భయంతో షిప్పింగ్ కంపెనీలు వెనుకంజ వేస్తున్నాయని, దీంతో వైద్య సామగ్రి సరుకులు ఇతర దేశాల్లోనే నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు.

**ప్రైవేటు ఫార్మసీలపై ప్రభుత్వ నియంత్రణ...**

ప్రైవేటు ఫార్మసీలకు అనుమతించడం క్యూబా పార్లమెంటు జూన్‌లో ఆమోదించిన 176 ఆర్థిక సంస్కరణల్లో భాగం. ప్రైవేటు వ్యాపారాలను విస్తరించి, దేశ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడమే ఈ చర్యల లక్ష్యం.ఆహారం, ఇంధనం వంటి వాటిని ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. అదే తరహాలో వ్యాపారులు మందులను కూడా దిగుమతి చేసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు ఫార్మసీల ఏర్పాటుకు సంబంధించి సుమారు 36 ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఫార్మసీలు కూడా కొనసాగుతాయి.ప్రైవేటు ఫార్మసీలపై ప్రభుత్వం నియంత్రణ విధిస్తుంది. ఆసుపత్రుల్లో మాత్రమే వాడాల్సిన మందులు, కొన్ని నియంత్రిత ఔషధాలను వీటిలో విక్రయించడానికి అనుమతి ఉండదు. మందుల దిగుమతులను ప్రభుత్వ సంస్థల ద్వారానే చేపట్టాలి. అలాగే ప్రతి ఔషధానికి నియంత్రణ సంస్థ అనుమతి ఉండాలి. వాటిని సరైన పద్ధతిలో నిల్వ చేయాలి. ఈ అంశాలపై వ్యాఖ్యానించాలన్న అభ్యర్థనకు క్యూబా ప్రభుత్వం స్పందించలేదు.అయితే ప్రైవేటు ఫార్మసీలు అందుబాటు లోకి వచ్చినా మందులను కొనగలిగే స్థోమత ఉంటుందా? అన్నది చాలామందిని వేధిస్తున్న ప్రశ్న.69 ఏళ్ల సారా మార్క్వెజ్ రక్తపోటు నియంత్రణ కోసం మందులు వాడుతున్నారు. గతంలో ప్రభుత్వ ఫార్మసీల్లో ఒక బ్లిస్టర్ ప్యాక్ మందులు 0.30 క్యూబా పెసోలకే దొరికేవని ఆమె చెప్పారు. అయితే ఇటీవలి నెలల్లో అనధికారిక విక్రేతలు అదే పరిమాణంలోని మందులకు 1,000 పెసోలు (1.50 డాలర్లు) వరకు వసూలు చేస్తున్నారు. ఇది ఆమె నెలవారీ పింఛనులో 30 శాతానికిపైగా."మందులను ఎంత ధరకు అమ్ముతారు? అది ప్రజల కొనుగోలు శక్తిపై ఆధారపడి ఉంటుంది. అంత ధర పెట్టి నేను కొనలేను" అని సారా ఆవేదన వ్యక్తం చేశారు.

# సెన్సెక్స్ 547 పాయింట్లు పతనం.. 22,400 దిగువకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లలో బలహీనత కనిపించడంతో మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.సెన్సెక్స్ 547.65 పాయింట్లు నష్టపోయి 71,924.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.10 పాయింట్లు తగ్గి 22,363.35 వద్ద ముగిసింది. ప్రారంభంలో సానుకూలంగా కదిలిన నిఫ్టీ, 22,600 స్థాయిని నిలబెట్టుకోలేకపోవడంతో అమ్మకాల ఒత్తిడికి లోనైందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు.నిఫ్టీకి తక్షణ మద్దతు 22,300–22,200 స్థాయిల మధ్య ఉందని నిపుణులు తెలిపారు. ఈ స్థాయి కిందకు దాటితే 22,000 వరకు పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, మార్కెట్‌లో కోలుకోవడం కొనసాగాలంటే నిఫ్టీ తిరిగి 22,500–22,600 స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని అంచనా వేశారు.నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, ఐటీసీ, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీలు ఎక్కువగా పడిపోయాయి. అయితే మీడియా, కెమికల్స్ రంగాల షేర్లు లాభాలతో ముగిశాయి.ప్రధాన సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కొంత మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.08 శాతం పెరగ్గా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 1.42 శాతం లాభపడింది. రెండో త్రైమాసిక ఫలితాలపై ఆశలు మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లకు మద్దతిచ్చాయని విశ్లేషకులు పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, సౌదీ అరేబియా సహా ప్రాంతీయ ఇంధన మౌలిక సదుపాయాలపై హూతీ దాడుల కారణంగా ముడిచమురు సరఫరాకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు పెద్ద కంపెనీల షేర్లపై ఒత్తిడి పెంచాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

# ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలు.. తూర్పు జలాల్లోకి ప్రయోగాలు




: ఉత్తర కొరియా సోమవారం తూర్పు సముద్ర జలాల వైపు పలు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దక్షిణ కొరియా సైన్యం ఈ విషయాన్ని వెల్లడించింది. ఇరు దేశాల మధ్య దౌత్య చర్చలు సుదీర్ఘకాలంగా నిలిచిపోవడంతో ఇప్పటికే ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉత్తర కొరియా వరుసగా ఆయుధ పరీక్షలు చేపడుతోంది.దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ వివరాల ప్రకారం.. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ పరిసర ప్రాంతాల నుంచి ఈ క్షిపణులను ప్రయోగించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఆ దేశం విమానాశ్రయాన్ని ప్రధాన క్షిపణి ప్రయోగ కేంద్రంగా ఉపయోగిస్తోంది. ఎన్ని క్షిపణులను గుర్తించారో, అవి ఎంత దూరం ప్రయాణించాయో దక్షిణ కొరియా సైన్యం వెంటనే వెల్లడించలేదు. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ మాత్రం కనీసం రెండు క్షిపణులను గుర్తించినట్లు తెలిపింది. అవి తమ ప్రత్యేక ఆర్థిక మండలి వెలుపల సముద్ర జలాల్లో పడినట్లు అంచనా వేసిందిదక్షిణ కొరియా శుక్రవారం తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించింది. ఇది ధ్వని వేగానికి కనీసం ఐదు రెట్ల వేగంతో ప్రయాణించడం తోపాటు క్షిపణి రక్షణ వ్యవస్థలకు చిక్కకుండా దూసుకెళ్లేలా రూపొందించారు. సంప్రదాయ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడంలో ఇది కీలక ముందడుగు అని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ పేర్కొన్నారు.మరోవైపు.. అణ్వాయుధాలను మోసు కెళ్లగల క్షిపణుల సామర్థ్యాన్ని పెంచుకోవడంపై ఉత్తర కొరియా దృష్టి సారించింది. అక్టోబర్ 3న హైపర్‌సోనిక్ మధ్యంతర శ్రేణి క్షిపణిని పరీక్షించినట్లు ఆ దేశం ప్రకటించింది. దక్షిణ కొరియా, జపాన్ క్షిపణి రక్షణ వ్యవస్థలను తప్పించుకునేలా దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఇతర క్షిపణి పరీక్షలు, ప్రత్యక్ష సైనిక విన్యాసాలు నిర్వహించడంతోపాటు కొత్త యుద్ధనౌకను కూడా నౌకాదళంలో చేర్చుకుంది. అణ్వాయుధ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్.. అమెరికా, దక్షిణ కొరియా దౌత్య చర్చల పునరుద్ధరణ ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నారు. గత నెలలో దక్షిణ కొరియా సరిహద్దు సమీపంలో మందుపాతరలు పేలడంతో ముగ్గురు దక్షిణ కొరియా సైనికులు గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియా అమర్చిన మందుపాతరలే కారణమని దక్షిణ కొరియా సైన్యం, అమెరికా నేతృత్వంలోని ఐక్యరాజ్యసమితి కమాండ్ నిర్ధారించాయి. అయితే ఉత్తర కొరియా ఈ ఆరోపణలను ఖండించింది. క్షమాపణ చెప్పాలన్న దక్షిణ కొరియా డిమాండ్‌ను ఎగతాళి చేసింది.కిమ్ జోంగ్ ఉన్ గత కొన్నేళ్లుగా దక్షిణ కొరియాతో దౌత్య సంబంధాలు, సహకారాన్ని పూర్తిగా నిలిపివేశారు. ఆ దేశాన్ని శాశ్వత శత్రువుగా అభివర్ణించారు. అమెరికాతో అణు చర్చలు నిలిచిపోయిన నేపథ్యంలో ఈ వైఖరిని కొనసాగిస్తున్నారు. 2019లో నిలిచిపోయిన చర్చలను పునరుద్ధరించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన పిలుపులనూ కిమ్ ఇప్పటివరకు పట్టించుకోలేదు. ప్యాంగ్యాంగ్‌పై అమెరికా తన శత్రుత్వ వైఖరిని విడనాడాలని, చర్చలకు ముందస్తు షరతుగా ఉత్తర కొరియా అణ్వాయుధాలను వదులుకోవాలన్న డిమాండ్‌ను ఉపసంహరించుకోవాలని కిమ్ ప్రభుత్వం కోరుతోంది.ఉత్తర కొరియాతో చర్చలు, సంబంధాల పునరుద్ధరణకు మొగ్గుచూపుతున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు లీకి తాజా పరిణామాలు ఇబ్బందికరంగా మారాయి. మందుపాతర పేలుళ్లపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతున్నప్పటికీ ఆయన ఉత్తర కొరియా పట్ల తన వ్యాఖ్యలను సంయమనంతో కొనసాగిస్తున్నారు. అదే సమయంలో దక్షిణ కొరియా సంప్రదాయ రక్షణ సామర్థ్యాలను పెంచుకోవాలని, అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టులో దక్షిణ కొరియాతో నిర్వహించాల్సిన ప్రధాన సైనిక విన్యాసాన్ని అమెరికా ఏకపక్షంగా తగ్గించింది. కిమ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు

# రియాద్ విమానాశ్రయంపై మళ్లీ దాడి.. 13కు చేరిన మృతుల సంఖ్య




సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల టెర్మినల్‌పై ఆదివారం మరోసారి క్షిపణి దాడి జరిగింది. శనివారం ఇదే టెర్మినల్‌పై జరిగిన క్షిపణి దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోయిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. యెమెన్‌లో ఇరాన్ మద్దతున్న హూతీ తిరుగుబాటుదారులతో పోరాడుతున్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఈ దాడులతో పాటు మరికొన్ని దాడుల బాధ్యతను హూతీలు ప్రకటించారు.రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయ సముదాయంలో టెర్మినల్ 3, 4లపై తాజా దాడి జరిగినట్లు సౌదీ అధికారులు తెలిపారు. ఈ టెర్మినళ్లు దేశీయ విమానాల రాకపోకలకు సేవలందిస్తాయి. దాడిలో పలువురు గాయపడ్డారు. గత ఐదు రోజుల్లో ఈ విమానాశ్రయంపై నాలుగుసార్లు దాడులు జరిగాయి. శనివారం జరిగిన క్షిపణి దాడి తర్వాత విమానాశ్రయాన్ని మూసివేశారు. ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత గల్ఫ్ అరబ్ దేశంలో చోటుచేసుకున్న అత్యంత ప్రాణాంతక దాడి ఇదే. ఈ ఘటనల్లో 300 మందికి పైగా గాయపడగా.. కొందరి పరిస్థితి విషమంగా ఉంది.యుద్ధంలో కొత్తగా తెరపైకి వచ్చిన ఈ పరిణామాలు అమెరికా సైనిక జోక్యం మరింత పెరిగే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. హూతీలపై పోరులో అమెరికా కూడా పాల్గొనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చెప్పారు. అయితే, ఆదివారం వైట్‌హౌస్ ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.శనివారం రియాద్‌పై జరిగిన దాడిలో గాయపడిన తమ దేశ పౌరుడు ఆదివారం మృతిచెందినట్లు సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. దీంతో మృతుల సంఖ్య 13కు చేరినట్లయింది. మరోవైపు దమ్మాంలోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా దాడి జరిగినట్లు సౌదీ అధికారులు వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలను మాత్రం ప్రకటించలేదు. దమ్మాం నగరం బహ్రెయిన్, ఖతర్ సమీపంలోని పర్షియన్ గల్ఫ్ తీరంలో ఉంది.

**మరోసారి దాడి జరగడంతో...**

రియాద్ విమానాశ్రయంపై తాజా దాడికి కొద్దిసేపటి ముందే యెమెన్ రాజధాని సనాలోని విమానాశ్రయంపై మరోసారి దాడి జరిగిందని హూతీలు ప్రకటించారు. ఈ దాడికి సౌదీ అరేబియానే కారణమని ఆరోపించారు. ఆదివారం రాత్రి కూడా సనాపై మరిన్ని దాడులు జరిగినట్లు హూతీల ఆధీనంలోని అల్ మసీరా టీవీ తెలిపింది. వీటికి సౌదీ అరేబియానే కారణమని ఆరోపించింది. అయితే, ఈ దాడులపై సౌదీ ప్రభుత్వం స్పందించలేదు.ఈ పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా, ధరలపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. హోర్ముజ్ జలసంధికి ప్రత్యామ్నాయంగా కీలకమైన బాబ్ అల్ మందెబ్ జలసంధి మీదుగా జరిగే వాణిజ్య నౌకల రాకపోకలపైనా ఆందోళనలు పెరుగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ మార్గానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ ఉద్రిక్తతలు ప్రాంతంలోని పౌరులు, విమాన ప్రయాణాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**సౌదీ యువరాజుతో మాట్లాడతానన్న ట్రంప్...**

సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో మాట్లాడతానని ట్రంప్ గతంలో చెప్పినప్పటికీ.. ఆదివారం నాటికి ఆ దిశగా ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఇరాన్‌కు మద్దతుగా పనిస్తున్న హూతీలను ఎదుర్కొనేందుకు సౌదీ అరేబియా సహాయం కోరుతోంది. ఈ తిరుగుబాటు బృందం ప్రస్తుతం ఇరాన్‌కు అత్యంత చురుకైన మద్దతుదారుల్లో ఒకటిగా ఉంది.అమెరికా నేరుగా రంగంలోకి దిగితే ఎర్ర సముద్రం దక్షిణ భాగంలోని బాబ్ అల్ మందెబ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలను హూతీలు అడ్డుకునే అవకాశం ఉంది. అలా జరిగితే పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు సరఫరా మరింత తగ్గవచ్చు. గత నెలలో ఈ జలసంధి సమీపంలోని కీలక ప్రాంతాలను హూతీలు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. యెమెన్‌లో అంతర్జాతీయం గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.సౌదీ విమానాశ్రయా, చమురు మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాలపై హూతీలు చేస్తున్న దాడులు సౌదీకి ఎదురవుతున్న మరో సమస్యను బయటపెడుతున్నాయి. క్షిపణులను అడ్డుకునే రక్షణ వ్యవస్థల నిల్వలు తగ్గిపోతున్న నేపథ్యంలో ఫ్రాన్స్, బ్రిటన్, పాకిస్థాన్, ఈజిప్టు దేశాలు గగనతల రక్షణకు సాయం అందించాలని సౌదీ కోరినట్లు ప్రాంతీయ అధికారులు గత నెలలో అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ యుద్ధం కారణంగా అమెరికా వద్ద కూడా ఇలాంటి రక్షణ వ్యవస్థల నిల్వలు తగ్గుతున్నాయని ఓ అధికారి పేర్కొన్నారు.హూతీల హెచ్చరికల నేపథ్యంలో సౌదీ గగనతలాన్ని వినియోగించడంపై కొన్ని విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. సౌదీ విమానాశ్రయాలకు సేవలందించే కొన్ని విమానాలను రద్దు చేశాయి. అక్కడి విమానాశ్రయాలను ఉపయోగిం చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కొన్ని దేశాల రాయబార కార్యాలయాలు తమ పౌరులకు సూచించాయి.ఆదివారం దాడి జరిగిన సమయంలో రియాద్‌లో సౌదీ అరేబియా కీలక అంతర్జాతీయ ఇంధన సదస్సును నిర్వహిస్తోంది. త్వరలో పెట్టుబడుల సదస్సు సహా పలు ముఖ్య కార్యక్రమాలు కూడా జరగనున్నాయి. మహమ్మద్ బిన్ సల్మాన్ నేతృత్వంలో సౌదీ అరేబియా వ్యాపార, పర్యాటక కేంద్రంగా ప్రపంచానికి మరింత చేరువ కావాలని ప్రయత్ని స్తోంది. హూతీల దాడులు ఈ లక్ష్యాలకు అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది."ఎవరూ మా వెన్ను విరవలేరు. మేము ఫీనిక్స్ పక్షిలా బూడిదలో నుంచి మళ్లీ మళ్లీ పైకి వస్తాం" అని సౌదీ ఇంధన శాఖ మంత్రి ప్రిన్స్ అబ్దుల్‌అజీజ్ బిన్ సల్మాన్ అల్ సౌద్ సదస్సులో అన్నారు.గత నెలలో దాడికి గురై, కొన్ని రోజుల పాటు మూతపడిన ఈస్ట్–వెస్ట్ చమురు పైప్‌లైన్‌తో పాటు మరిన్ని పైప్‌లైన్ల నిర్మాణంపైనా సౌదీ దృష్టి పెట్టిందని ఆయన తెలిపారు. అయితే, వాటి వివరాలను వెల్లడించలేదు.

**ఇరువైపులా పెరుగుతున్న మృతుల సంఖ్య...**

ఆదివారం సనాలోని ఓ ఇంటిపై సౌదీ వైమానిక దాడి జరిగి ఉండొచ్చని, ఈ ఘటనలో ఓ చిన్నారి మృతిచెందగా మరో ఆరుగురు గాయపడ్డారని హూతీల ఆధీనంలోని ఆరోగ్య శాఖ తెలిపింది. గత ఐదు వారాల్లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాల దాడుల్లో 91 మంది యెమెన్ పౌరులు మృతిచెందారని పేర్కొంది. వీరిలో 60 శాతం మంది మహిళలు, చిన్నారులేనని తెలిపింది.ఈ ఆరోపణలపై సౌదీ అధికారులు వెంటనే స్పందించలేదు. వారం క్రితం హూతీలపై పెద్ద ఎత్తున సైనిక చర్య ప్రారంభమైనప్పటి నుంచి యెమెన్‌లో పోరు తీవ్రత పెరిగింది.శనివారం రియాద్‌పై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిలో కొందరి వివరాలు బయటకు వచ్చాయి. మృతుల్లో ఈజిప్టుకు చెందిన ఓ విమాన సహాయకురాలు, సౌదీలో నివసిస్తున్న సిరియా దేశానికి చెందిన ఓ వితంతువు ఉన్నారు. మృతిచెందిన అమెరికా పౌరుడి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.

**హూతీల వ్యూహం వారికే ఎదురుదెబ్బ కావచ్చు...**

ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత కొంతకాలం హూతీలు నేరుగా రంగంలోకి దిగలేదు. అయితే, గత కొన్నేళ్లలో తమ సైనిక సామర్థ్యాలను పెంచుకుని టెహ్రాన్‌కు బలమైన మిత్రులుగా ఎదిగారు. ఇప్పుడు ఇరాన్‌కు ప్రాంతీయ ప్రత్యర్థిగా ఉన్న సౌదీ అరేబియాను, అమెరికాకు కీలక మిత్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు.ఆదివారం రాత్రి సౌదీ అరేబియా, ఇరాన్ విదేశాంగ మంత్రులు ఫోన్‌లో మాట్లాడారు. సైనిక చర్యలకే ప్రాధాన్యం ఇస్తూ రాజకీయ పరిష్కారాన్ని పట్టించుకోకపోవడం సరికాదని తాను హెచ్చరించినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. సౌదీ అరేబియా, హూతీల మధ్య చర్చలు ప్రారంభించేందుకు సహకరించడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని చెప్పారు.సౌదీ అరేబియా 2015లో యెమెన్ అంతర్యుద్ధంలో అక్కడి ప్రభుత్వానికి మద్దతుగా జోక్యం చేసుకోవడంతో సౌదీ, హూతీల

మధ్య పోరు మొదలైంది. 2022లో కుదిరిన కాల్పుల విరమణతో కొంతకాలం ప్రశాంతత నెలకొంది. అయితే, ఇరాన్ నుంచి వచ్చిన విమానం సనా విమానాశ్రయంలో దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో సౌదీ దాడి చేసిందని ఆరోపిస్తూ జులైలో హూతీలు మళ్లీ దాడులు ప్రారంభించారు.ఈ ఘటనతో సౌదీ నేతృత్వంలోని దిగ్బంధంపై హూతీల ఆధీనంలోని ప్రాంతాల్లో ఆగ్రహం మళ్లీ పెరిగింది. దీనికి ప్రతిగా సౌదీ అరేబియాపై దిగ్బంధం విధిస్తున్నట్లు హూతీలు ప్రకటించారు.ప్రస్తుతం హూతీలు స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తిరిగి చేజిక్కించుకునేందుకు యెమెన్ ప్రభుత్వ దళాలు ప్రయత్నిస్తున్నాయి. వీటికి సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వైమానిక మద్దతు అందిస్తున్నాయి.అయితే, సౌదీపై ఒత్తిడి పెంచేందుకు హూతీలు అనుసరిస్తున్న వ్యూహం వారికి ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉందని ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్‌కు చెందిన యెమెన్ సీనియర్ విశ్లేషకుడు అహ్మద్ నాగి అభిప్రాయపడ్డారు. "రియాద్ వెనక్కి తగ్గేలా చేయడానికి బదులుగా.. సౌదీ కీలక మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం వల్ల సైనిక చర్యను కొనసాగించాలన్న ఆ దేశ పట్టుదల మరింత పెరగవచ్చు" అని ఆయన పేర్కొన్నారు.

## పీఠభూమి ప్రయాణం!

పీఠభూమి మీద ప్రయాణిస్తున్నంత మాత్రాన.. ఆ దారిలో ఎగుడుదిగుళ్లు ఉండవని కాదు. భారత, అమెరికా అధికారులు ఇప్పుడు అనుభవిస్తున్నది ఇదే. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ "పీఠభూమి"గా అభివర్ణించిన దారిలో, వారు గుంతలనూ, గుడ్డి మలుపులనూ దాటుకుంటూ ముందుకెళ్తున్నారు. సెప్టెంబర్ 24న కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, వాణిజ్య ఒప్పందం "దాదాపు పూర్తయినట్టే" (డన్ అండ్ డస్టెడ్) అని ప్రకటించారు. కొద్ది రోజులకే మిల్వాకీలో జరిగిన జీ-20 వాణిజ్య మంత్రుల సమావేశం తర్వాత అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్, చర్చలు "చివరి దశ"లో ఉన్నాయని చెబుతూనే, ఒప్పందం "ఇప్పట్లో కుదిరే అవకాశం లేదు" అన్నారు. సమస్యాత్మక అంశాలను గుర్తించామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, పాడి రంగాల్లోకి ప్రవేశం కల్పించాలన్న అమెరికా ఒత్తిడిని భారత్ ప్రతిఘటించడం గతంనుంచీ ఉన్న ప్రధాన అడ్డంకి. ఈ ఉద్రిక్తత చల్లారకముందే అక్టోబర్ 8న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వీసా మోసాలపై జరిగిన విలేకరుల సమావేశంలో హెచ్-1బీ వీసా కార్మికులను "ఇండెంచర్డ్ సర్వెంట్స్"గా అభివర్ణించారు; విదేశీ ఔట్‌సోర్సింగ్ సంస్థలు అమెరికా కార్మికుల వేతనాలను తగ్గిస్తున్నాయని ఆరోపించారు. అదే సమయంలో అమెరికా కార్మిక శాఖ ఎనిమిది సంస్థలను శాశ్వత కార్మిక ధృవీకరణ (పెర్మ్) ప్రక్రియ నుంచి సస్పెండ్ చేసింది. విదేశాంగ శాఖ వెంటనే స్పందిస్తూ, ఆ పదజాలం "అనవసరమైనది", "తీవ్ర అభ్యంతరకరమైనది", వలసపాలన నాటి బాధాకర జ్ఞాపకాలను రేకెత్తిస్తుందని పేర్కొంది. అమెరికాలోని భారతీయ నిపుణులు ఉన్నత విద్యావంతులు, నైపుణ్యం కలవారని, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణల వాతావరణానికి గణనీయంగా తోడ్పడుతున్నారని గుర్తుచేసింది. పెర్మ్ సస్పెన్షన్ వల్ల హెచ్-1బీ వీసాల చెల్లుబాటుపై ప్రభావం లేదని కూడా స్పష్టం చేసింది.

ఈ గందరగోళం వెనుక ఉన్న పెద్ద చిత్రాన్ని చూడాలి. ఒక విశ్లేషకుడి వాదన ప్రకారం, అమెరికా.. చైనాను ఎదుర్కోవడంలో, ఆధునిక సాంకేతికతలో తమకు తోడ్పడుతుందని, వికసిత భారత్‌కు ఉచిత ప్రయాణం ఇస్తుందని భారత విధాన వర్గాలు, ఆకాంక్షాత్మక మధ్యతరగతి భావించే "ఆధారపడే మనస్తత్వం" నుంచి మనం బయటపడాలి. "మాగా" (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్), "మిగా" (మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్) ఒకే శరీరానికి రెండు చేతులన్న భావనగా చూడకూడదు. బుష్ కాలంలోని పౌర అణు ఒప్పందానికి ఆ అవగాహనే పునాది అయినా, ఆ కాలం ముగిసిందన్నది ఆయన విశ్లేషణ. గత దశాబ్దంలో అమెరికా ప్రభుత్వాలు భాగస్వామ్యానికి "బిల్లులు" పంపుతూనే ఉన్నాయని, భారత్ వాటిలో కొన్నింటిని చెల్లించిందని, రక్షణ పరికరాలు కొనుగోలు చేసిందని, కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించిందని, ఇరాన్, వెనిజువెలా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసిందని గుర్తుంచుకోవాలి. ఈ దృష్టిలో, ఒక పాకిస్తాన్ సైనిక అధికారిని శ్వేతసౌధంలో భోజనానికి పిలవడమే భారత్‌కు నిజమైన మేలుకొలుపు. ఈ వాదనలో కొంత వాస్తవం ఉంది. న్యూయార్క్‌లోని ఆసియా సొసైటీలో విదేశాంగ మంత్రి జైశంకర్ చేసిన వ్యాఖ్యలు ఇదే మార్పును సూచిస్తున్నాయి. వాణిజ్య ఒప్పందంపై "ఎక్కువ తక్కువగా ఒక అవగాహన"కు వచ్చామని చెబుతూనే, ఎగుడుదిగుడుకు కారణాలుగా సుదీర్ఘ చర్చలను, సరిహద్దు ఉగ్రవాదంపై భారత ఆందోళనకు తగిన అవగాహన, సానుభూతి లేకపోవడాన్ని ప్రస్తావించారు. "నా ప్రధాన ఆందోళనను నా భాగస్వామి పూర్తిగా అర్థం చేసుకోకపోతే, సంబంధంపై ప్రభావం ఉంటుంది" అన్నారు; ఇది పాకిస్తాన్‌తో అమెరికా సాన్నిహిత్యంపై పరోక్ష వ్యాఖ్యగానే అందరూ భావించారు. అయితే భారత ప్రభుత్వం అమెరికాతో సంబంధాలను "ముగిసిన అధ్యాయం"గా భావించడం లేదు. ఇటీవలి మోదీ, ట్రంప్ ఫోన్ సంభాషణ తర్వాత ఇరు దేశాలు "సన్నిహిత సంప్రదింపులు" కొనసాగించాలని అంగీకరించాయి. అమెరికా ఇప్పటికీ భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి; 2024లో ద్వైపాక్షిక వాణిజ్యం 129 బిలియన్ డాలర్లకు చేరగా, భారత్‌కు 45.7 బిలియన్ డాలర్ల మిగులు ఉంది. ఈ మిగులుపై ట్రంప్ పదేపదే విమర్శిస్తున్నా, దానికి ప్రతిగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారతీయ అమెరికన్లు చేసిన తోడ్పాటును భారత్ గణాంకాలతో చూపించాలి. ఆ తోడ్పాటు ఎంతో ప్రభుత్వంగానీ, విద్యావేత్తలుగానీ ఇప్పటివరకూ కచ్చితంగా అంచనా వేయకపోవడం విచారకరం. కేవలం "అనవసరం" అంటూ ప్రకటనలు ఇవ్వడం కంటే, గణాంకాలతో కూడిన వాదన ఎక్కువ ప్రభావం చూపుతుంది.

దీనికి మించి, ప్రపంచ రాజకీయాల్లో కొత్త "గ్రేట్ గేమ్" రూపుదిద్దుకుంటోంది: అది చైనా-అమెరికా సంబంధం. జైశంకర్ ఆ రెండు దేశాల అధ్యక్షుల భేటీని ప్రస్తావిస్తూ, కొన్ని అంశాల్లో "సమానతలు" ఉన్నా, మొత్తం మీద వారి సంబంధం "పోటీ"లోనే ఉందని, ఈ ప్రతిష్టంభన "మూడో దేశాలకు" ఖాళీని పూరించే అవకాశమిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో భారత్ ఎలా ఆలోచిస్తుంది, ఎలా వ్యవహరిస్తుంది అన్నది రెండు అగ్రరాజ్యాలకూ ముఖ్యమే. డిసెంబర్ 14, 15 తేదీల్లో మయామిలో జరిగే జీ-20 సదస్సు సందర్భంగా క్వాడ్ భేటీ ఏర్పాటవుతుందని, భారత్ రక్షణ దిగుమతుల్లో అమెరికా వాటా ప్రస్తుత స్థాయిలోనే ఉండేలా కొన్ని కొనుగోళ్లు జరగవచ్చని ఆ విశ్లేషకుడు అంచనా వేస్తున్నారు. కానీ భారత్ ఏ ఒక్క శక్తిపైనా అతిగా ఆధారపడకుండా, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడమే సరైన మార్గం. దీనికి ఆచరణాత్మక చర్యలు కావాలి: యూరోపియన్ యూనియన్, బ్రిటన్ వంటి ఇతర భాగస్వాములతో ఒప్పందాలను వేగవంతం చేయడం (తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేశామని, వీటితో ప్రపంచ జీడీపీలో సుమారు 75 శాతం మార్కెట్లకు ప్రాధాన్య ప్రవేశం లభిస్తుందని గోయల్ చెప్పారు), దేశీయ ఉత్పత్తి, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడం, ఐటీ రంగం కేవలం అమెరికా మార్కెట్‌పైనే ఆధారపడకుండా విస్తరించడం. అదే సమయంలో అమెరికాతో సంబంధాలను తెంచుకోవడం కూడా తెలివైన పని కాదు; చర్చలు కొనసాగిస్తూ, భారత ప్రయోజనాలను గట్టిగా వినిపిస్తూ, సంతులనం పాటించడమే నేటి అవసరం. ట్రంప్ అమెరికా ప్రయోజనాలపైనే దృష్టి పెట్టడం అర్థం చేసుకోదగినదే; మన ప్రయోజనాలపై మనం కూడా అంతే స్పష్టతతో ఉండాలి. పీఠభూమి మీద ప్రయాణం ఎగుడుదిగుళ్లు లేకుండా ఉండదు. అవి వచ్చినప్పుడు కంగారు పడకుండా, ఎవరి ఉచిత ప్రయాణాన్నీ ఆశించకుండా, తమ దారిని తామే నిర్మించుకునే ఆత్మవిశ్వాసమే భారత్‌కు నిజమైన బలం!

## ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక!

శాంతియుతంగా సమావేశమయ్యే, నిరసన తెలిపే ప్రాథమిక హక్కును భారత రాజ్యాంగం పౌరులందరికీ హామీ ఇచ్చింది. సంఘటితమయ్యే, సమావేశమయ్యే, మాట్లాడే హక్కు ప్రజాస్వామ్యానికి గుండెకాయ, వీటిలో ఏ ఒక్క ప్రాథమిక హక్కును అణచివేసినా అది ప్రజాస్వామ్యాన్నే కుదించడం. ఈ నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పోలీసు బలప్రయోగంతో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రాజధాని ఢిల్లీలో ఈ హక్కులను అణచివేస్తున్నదన్న విమర్శలు ఆందోళన కలిగిస్తున్నాయి. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వంటి యువజన, విద్యార్థి సంఘాలు అక్టోబర్ 10న శాంతియుత నిరసనకు పిలుపునిచ్చాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్) రద్దు వారి డిమాండ్లు. చట్టప్రకారం శాంతియుత సమావేశాలకు వీలు కల్పించాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా చర్యలు తీసుకుందన్నది ఆరోపణ. నిరసనకు ముందు రోజు, అంటే అక్టోబర్ 9న, ఢిల్లీలో 57 మెట్రో స్టేషన్ల మూసివేత, ఢిల్లీకి వచ్చే రైళ్ల రద్దుపై వచ్చిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, నిరసనల కారణంగా మెట్రో, రైలు సేవలను పూర్తిగా నిలిపివేయకూడదని కేంద్రాన్ని ఆదేశించింది; ప్రయాణం, సమావేశంపై సమగ్ర నిషేధం విధించడం కుదరదని స్పష్టం చేసింది. కానీ అక్టోబర్ 10న జరిగింది వేరే. ఢిల్లీ పోలీసులు ఉదయమే 150 మందిని నిర్బంధించామని చెప్పగా, తర్వాత కథనాల ప్రకారం వేలాది మందిని ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు (అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్), పలువురు ప్రతిపక్ష నాయకులు, న్యాయవాదులు, పాత్రికేయులున్నారు. సీజేపీ నాయకులు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను విమానం దిగిన వెంటనే అందులోనే నిర్బంధించారు. జంతర్ మంతర్‌వైపు కవాతు చేసిన న్యాయవాదులను నిర్బంధించారు, గంటల తరబడి ఉంచారు. ఢిల్లీ నడిబొడ్డున గుర్తింపు బిళ్లలు లేని పోలీసు సిబ్బంది వీడియోల్లో కనిపించారని, పాత్రికేయులు, కార్యకర్తలు, విద్యావేత్తలు, న్యాయవాదులపై దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. అయితే ప్రభుత్వ వైపు నుంచి భిన్న వాదన వినిపిస్తోంది: అక్టోబర్ 10న 271 రైళ్లు సాధారణ శనివారం షెడ్యూల్ ప్రకారమే నడిచాయని, శాంతిభద్రతల పరిరక్షణకే చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ఆరోపణలు, ప్రతివాదనల్లో నిజానిజాలను తేల్చాల్సింది స్వతంత్ర విచారణే.



ఈ పరిణామాలు కొత్త కావు, ఆందోళన కలిగించే ఒక ధోరణిలో భాగంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జులైలో పరీక్షా పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన 'ఛలో సంసద్' నిరసనలో పోలీసులు అధిక బలప్రయోగం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. మహిళా నిరసనకారులపై పురుష పోలీసులు దాడి చేస్తున్న వీడియో ఆధారాలున్నా, నెలలు గడిచినా ప్రభుత్వంగానీ, సుప్రీంకోర్టుగానీ ఎవరినీ బాధ్యులుగా నిర్ధారించలేదన్న విమర్శ ఉంది. కనీసం 60 మంది గాయపడ్డారని, లింగ ఆధారిత హింస ఆరోపణలు కూడా ఉన్నాయని పిటిషన్లు పేర్కొన్నాయి, వాటిలో స్వతంత్ర దర్యాప్తు, నిరసనల సమయంలో పోలీసు చర్యలపై మార్గదర్శకాలు, యూనిఫారం లేని లేదా గుర్తింపు లేని సిబ్బందిని వినియోగించకుండా నిషేధం కోరారు. అక్టోబర్ 3న జంతర్ మంతర్ వద్ద ముగ్గురు మహిళా జర్నలిస్టులు పోలీసు అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు; ఆ ఫిర్యాదు నమోదుకే హక్కుల సంఘాలు, పాత్రికేయులు స్టేషన్ ముందు నిరసన తెలపాల్సి వచ్చింది, దాన్ని క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆ సందర్భంగా పోలీసులు "నిష్పాక్షిక విచారణ" హామీ ఇచ్చినా, అదే తరహా ఆరోపణలు మళ్లీ ఎదురవుతుండటం పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తోంది. అక్టోబర్ 10 నిర్బంధాలపై, మెట్రో పరిమితులపై సుప్రీంకోర్టు ఆదివారం ప్రత్యేక విచారణ జరిపింది. తమ అక్టోబర్ 9 ఆదేశాల ఉల్లంఘనగా భావిస్తూ దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్, ముందస్తు నిర్బంధాల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ వచ్చిన పిటిషన్లను పరిశీలించింది. సమస్య అత్యవసరమైనదని, తీవ్రమైనదని కోర్టు అంగీకరించి, తన ఆదేశాలను పునరుద్ఘాటించింది. అయితే ఇలాంటి విడివిడి ఆదేశాలు, సగం మనసుతో చేసే ఆవేదనలు, విమర్శకులను "విదేశీ ఏజెంట్లు", "దేశద్రోహులు" అంటూ ముద్ర వేయడం మానని, తన రికార్డుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వంపై ఎలాంటి నియంత్రణ ప్రభావం చూపడం లేదన్న విమర్శ వినిపిస్తోంది. కోర్టు ఏదైనా నిర్ణయాత్మక చర్య తీసుకోకపోతే, ప్రతి నిరసన సమయంలోనూ ఇదే పునరావృతమవుతుందన్న ఆందోళన సహజమే.

ఈ నిరసనలన్నిటి వెనుక ఉన్న అసలు కారణాన్ని మరువకూడదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష పేరిట లక్షలాది మంది పౌరులను జాబితాల నుంచి తొలగించారని, అది స్పష్టమైన చట్టవిరుద్ధ చర్య అని ప్రతిపక్షాలు, ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సంఘం, అధికార పక్షం ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నాయి; ప్రక్రియ నిబంధనల ప్రకారమే సాగిందని చెబుతున్నాయి. నిజానిజాలను తేల్చాల్సింది న్యాయస్థానాలే. కానీ ఎన్నికల సంఘంపై జవాబుదారీతనాన్ని కోరే బదులు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కాపాడేందుకు పోలీసు బలాన్ని వాడుతున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అధిపతి విషయంలో అధికార పక్షం ఇంతగా కదలడం, ఆయనకు, అధికార పార్టీకి మధ్య ఇతర పార్టీలతో పోలిస్తే భిన్నమైన సంబంధం ఉందన్న ప్రతిపక్షాల అనుమానాలకు ఊతమిస్తుంది. ప్రభుత్వం ఈ అపోహను చెరిపేయాలంటే, నిరసనకారులను అదుపు చేయడం కాదు, ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలను పారదర్శకంగా నివృత్తి చేయడమే మార్గం. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత, హింసకు పాల్పడేవారిని చట్టప్రకారం అడ్డుకునే హక్కు ఉంది. కానీ శాంతియుత నిరసనకు సిద్ధపడిన వేలాది మందిని, మాజీ ముఖ్యమంత్రులను, న్యాయవాదులను, పాత్రికేయులను ముందస్తుగా నిర్బంధించడం, రవాణా సౌకర్యాలను అడ్డుకోవడం ఆ పరిధిని దాటినట్టే కనిపిస్తుంది. నిరసనకారులు కూడా శాంతిని, చట్టాన్ని గౌరవించాలి; ఏ ఒక్క హింసాత్మక ఘటన కూడా న్యాయమైన డిమాండ్‌ను బలహీనపరుస్తుంది. ప్రభుత్వం చర్చలకు ముందుకు రావాలి; నిరసనల కోసం నిర్దిష్ట వేదికలు కేటాయించి, ఆ పరిధిలో శాంతియుత సమావేశాలకు అనుమతించాలి. పోలీసులు ఖచ్చితంగా గుర్తింపు బిళ్లలు ధరించేలా, యూనిఫారం లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకుండా ఆదేశాలు జారీ కావాలి. జులై, అక్టోబర్ ఘటనలపై స్వతంత్ర, కాలపరిమితితో కూడిన దర్యాప్తు జరిపి, దోషులపై చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు కూడా నిరసనల సమయంలో పోలీసు చర్యలపై స్పష్టమైన, అమలు చేయదగిన మార్గదర్శకాలను జారీ చేయడాన్ని పరిశీలించాలి. అంతిమంగా, ఏ ప్రభుత్వమైనా నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి, పౌరులపై అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదు. విమర్శను అణచివేయడం బలానికి చిహ్నం కాదు, అభద్రతకు సంకేతం; ప్రజాస్వామ్యంలో అసలైన బలం, నిలదీసే గొంతులను వినడంలోనే ఉంటుంది! ■

### పనికొచ్చే పలుకు



## ప్రతిదానికీ ఎక్స్‌ప్లనేషన్ ఇవ్వాల్సిన పని లేదు

గ్రూప్ చాట్ నుంచి సైలెంట్‌గా లెఫ్ట్ అయ్యారా? ఎవరినైనా మ్యూట్ చేశారా? ఒక రిలేషన్‌షిప్‌ను వదిలేసి, తర్వాత అందరికీ "అసలు ఏం జరిగిందంటే.." అని ఇన్‌స్టా స్టోరీలో వివరణ ఇవ్వాలని ఎప్పుడైనా అనిపించిందా? ఒకప్పుడు మనం అందరికీ వివరించాలనుకుంటాం, "వాళ్లు నన్ను తప్పుగా అనుకుంటారేమో" అని భయపడతాం. కానీ ఒక దశ తర్వాత విషయం అర్థమవుతుంది. మీరు ఆ పరిస్థితిని నిజంగా అనుభవించి, ఎదుటివారి జీవితం నుంచి ఎందుకు వెళ్లిపోయారో వివరించాల్సిన అవసరం లేదని.

ఒక సినిమా చూసినవారికి క్లైమాక్స్ ఎందుకలా వచ్చిందో చెప్పాల్సిన పనిలేదు, ఎందుకంటే వాళ్లు మొదటి సీన్ నుంచి చూశారు. మీతో కలిసి ఆ పరిస్థితిని అనుభవించిన వారికి అసలు నిజం ఏంటో తెలిసే ఉంటుంది. ఎన్నిసార్లు సర్దుకుపోయారో, ఎన్నిసార్లు ప్రయత్నించారో, ఎప్పుడు అలసిపోయారో వారికి తెలుసు. అప్పుడు కూడా మిమ్మల్ని అర్థం చేసుకోకపోతే, వారికి నిజం తెలియక కాదు, తెలుసుకోవాలని లేక. అలాంటి వారికి వివరణ ఇచ్చి ఏం లాభం?

ఇది ఒక వైఫై సిగ్నల్ లాంటిది. ఎదుటివారి ఫోన్‌లో రిసీవర్ ఆఫ్‌లో ఉంటే, మీరు ఎంత స్ట్రాంగ్ సిగ్నల్ పంపినా కనెక్ట్ కాదు. అర్థం చేసుకోవాలని అనుకోనివారికి మీరు గంటల తరబడి వివరించినా, వారు తమ అభిప్రాయం మార్చుకోరు, ఎందుకంటే వారు వినడానికి కాదు, తమ నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి వింటున్నారు. అలాంటిచోట మీ ఎనర్జీ, సమయం, మనశ్శాంతి వృథా. అందుకే కొన్నిసార్లు మౌనం, ఎక్కువ మాటలకంటే బలమైన సమాధానం.

సోషల్ మీడియా మన మనసులో ఒక భ్రమను నాటింది: ప్రతి నిర్ణయానికి లైక్స్ రావాలి, అందరూ "నువ్వు చేసింది కరెక్ట్" అనాలి. కానీ నిజజీవితంలో అది అసాధ్యం. మీరు ఎంత మంచి నిర్ణయం తీసుకున్నా, ఎవరో ఒకరు విమర్శిస్తారు. మీ ప్రతి నిర్ణయానికి అందరి మద్దతు అవసరం లేదనే నిజాన్ని గ్రహించినప్పుడే, మీరు నిజమైన స్వేచ్ఛను అనుభవిస్తారు. ఈ ఆలోచనను అలవర్చుకుంటే, మీ రోజువారీ జీవితంలో చిన్న చిన్న మార్పులు సాధ్యం. మొదటిది, ఒత్తిడి తగ్గుతుంది. "వాళ్లు ఏమనుకుంటారో" అనే భయం మనసు నుంచి తొలగిపోతే, తలలోని శబ్దం తగ్గుతుంది. రెండోది, నిర్ణయాలు తీసుకోవడం సులువవుతుంది. అందరినీ మెప్పించాలనే ప్రయత్నం లేనప్పుడు, మీకు ఏది సరైనదో అదే ఎంచుకోగలరు. మూడోది, మీ శక్తి సరైన చోట ఖర్చవుతుంది. అర్థం చేసుకోని వారికి వివరణలు ఇవ్వడానికి బదులు, మీ లక్ష్యాలు, ఆరోగ్యం, నిజంగా మీకు విలువనిచ్చే వారి కోసం సమయం కేటాయించగలరు. నాల్గోది, సంబంధాలు నాణ్యమవుతాయి. చిన్న ప్రయోగం చేయండి. ఎవరైనా మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నారనిపిస్తే, వెంటనే వివరణ ఇవ్వకండి. ప్రశ్నించుకోండి. "ఈ వ్యక్తి నా మాట నిజంగా వినాలనుకుంటున్నాడా?" సమాధానం "కాదు" అయితే, ఆ మెసేజ్‌ను డ్రాఫ్ట్‌లోనే వదిలేయండి. ఇంకో అలవాటు: ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకునే ముందు, "ఇది నా విలువలకు సరిపోతుందా?" అనుకోండి, "అందరూ ఏమంటారు?" అని కాదు.

చివరిగా ఒక మాట

ప్రతి కథకూ అందరూ ప్రేక్షకులు కారు. కొందరు ఫ్రంట్ రో కూర్చుని మీతో కలిసి నడిచినవారు, మరికొందరు బయట నుంచి రూమర్లు వినేవారు. రెండోరకం వారికి వివరణలు ఇవ్వడం మానేసి, మొదటి రకం వారిని, ముఖ్యంగా మిమ్మల్ని మీరే గౌరవించుకోండి. మీ నిర్ణయానికి మీరే నిలబడగలిగినప్పుడు, ఎవరి చప్పట్లూ అవసరం ఉండవు, అదే అసలైన స్వేచ్ఛ.



మనం రోజూ తినే ఆహారం శరీరాన్ని తీర్చిదిద్దినట్టే, చూసే సమాచారం మనసును తీర్చిదిద్దుతుంది. ఉదయం లేచింది మొదలు ఆర్థిక కష్టాలు, పెరుగుతున్న ధరలు, వ్యాపార నష్టాల వార్తలనే చూస్తూ ఉంటే, "ఎంత కష్టపడినా ప్రయోజనం లేదు" అనే భావన మనలో నెమ్మదిగా బలపడుతుంది. అది ఒక విషపు చుక్కలా అలవాటుగా మారి, ప్రయత్నించే ధైర్యాన్నే చంపేస్తుంది. వాస్తవాలను తెలుసుకోవడం అవసరమే, కానీ వాటితో పాటు అవకాశాలు, విజయగాథలు, పరిష్కారాలను కూడా చూడండి. మనసుకు సమతుల్యమైన ఆహారం ఇవ్వడమంటే.. విజయంవైపు ప్రయాణమే!

-మహాదేవ

### వింతల్లో వింతలు

## చిన్న కుక్క.. పెద్ద 'కమాండో' ఉద్యోగం!



మెక్సికో నేషనల్ గార్డ్‌లో కొత్తగా చేరిన రిక్రూట్ 'కమాండో' ఎవరో తెలుసా? 13 నెలల చిహువాహువా కుక్క, బరువు కేవలం ఏడు కిలోలు, ఎత్తు 21 సెంటీమీటర్లు! వృద్ధ యజమానులు సాకలేక ఇవ్వడంతో, చిహువాహువా రాష్ట్రంలోనే ఈ ఉద్యోగి దత్తత అయ్యాడు. ఇప్పుడు ఇతడికి టాక్టికల్ వెస్ట్, గాగుల్స్, హెల్మెట్, తలపై కెమెరా కూడా! మెట్లు ఎక్కుతూ, అడ్డంకులు దాటుతూ సెర్చ్ అండ్ రెస్క్యూ శిక్షణ పొందుతున్నాడు. స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో హ్యాండ్లర్ చేతిలో నిద్రపోతూ వైరల్ అయ్యాడు. "సార్జెంట్ 'రాడార్ కింద ఉండండి' అంటే, కమాండో మాటను అక్షరాలా పాటిస్తాడు!"

# వంటకాలు హెల్త్ & ఆరోగ్యం

## రుచికరమైన ఆహారం.. ఆరోగ్యకరమైన జీవనం

**ఈరోజే మొదలు పెట్టండి**
- రోజూ తాజా కూరగాయలు తినండి.
- ఆహారంలో పండ్లను చేర్చుకోండి.
- ఉప్పు, చక్కెర పరిమితంగా తీసుకోండి.
- వేయించిన పదార్థాలను తగ్గించండి.
- సమతుల ఆహారపు అలవాట్లు పెంపొందించుకోండి.

### రుచికరమైన ఆహారం.. ఆరోగ్యకరమైన జీవనం

**1. రోజువారీ ఆహారంలో కూరగాయల ప్రాముఖ్యత**

మన శరీరానికి ప్రతిరోజూ పోషకాలు అవసరం. కూరగాయలు, పండ్లు, ఆకుకూరల ద్వారా విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ లభిస్తాయి. సమతుల ఆహారం తీసుకోవడం ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**సమతుల ఆహారంలో ఇవి ఉండాలి:**
- ఆకుకూరలు -- ఐరన్, ఫోలేట్ వంటి పోషకాలు
- పప్పుధాన్యాలు -- ప్రోటీన్లు, ఫైబర్
- కూరగాయలు -- విటమిన్లు, ఖనిజాలు
- పండ్లు -- విటమిన్లు, సహజ పోషకాలు
- గింజలు, నట్స్ -- ఆరోగ్యకరమైన కొవ్వులు





### 2. ఆరోగ్యకరమైన అల్పాహారం

(Breakfast) ఎందుకు ముఖ్యం?

ఉదయం అల్పాహారం తీసుకోవడం శరీరానికి శక్తిని అందిస్తుంది. రోజువారీ పనులు చురుకుగా చేసుకోవడానికి తోడ్పడుతుంది. అల్పాహారంలో ప్రోటీన్లు, ఫైబర్, ఇతర పోషకాలు ఉండేలా చూసుకోవాలి.

**పోషకమైన అల్పాహార ఎంపికలు**

**ఇడ్లీ + సాంబార్**
- తేలికగా జీర్ణమవుతుంది.
- పప్పుల ద్వారా ప్రోటీన్లు లభిస్తాయి.

**ఓట్స్ ఉప్మా / గంజ**
- ఫైబర్‌ను అందిస్తుంది.
- జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

**వెజిటబుల్ ఉప్మా / పోహా**
- కూరగాయలతో పోషకాలు అందుతాయి.
- ఉదయం శక్తిని అందించడంలో సహాయపడుతుంది.

**పండ్లు ం గింజలు**
- విటమిన్లు, ఖనిజాలు అందుతాయి.
- ఆరోగ్యకరమైన అల్పాహారంలో భాగంగా తీసుకోవచ్చు.

### 3. హెల్త్ టిప్స్ --చిన్న అలవాట్లు, పెద్ద ప్రయోజనాలు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన ఆహారమే అవసరం లేదు. ప్రతిరోజూ పాటించే చిన్న చిన్న అలవాట్లు కూడా మంచి ఫలితాలను అందిస్తాయి.
- రోజంతా తగినంత నీరు తాగండి.
- రోజువారీ ఆహారంలో కూరగాయలు, పండ్లు చేర్చుకోండి.

- ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవడానికి ప్రయత్నించండి.
- రాత్రిపూట 7--9 గంటలు నిద్రపోండి.
- ఉదయం కొంత సమయం సూర్యరశ్మిలో గడపండి.
- పొగాకు, ధూమపానానికి దూరంగా ఉండండి.
- ధ్యానం, ప్రాణాయామం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోండి.



- నడక: 30 నిమిషాలు
- యోగా: 15--20 నిమిషాలు
- స్ట్రెచింగ్: 10 నిమిషాలు
- బలాన్ని పెంచే వ్యాయామాలు: మీ సామర్థ్యానికి అనుగుణంగాప్రారంభంలో తక్కువ సమయంతో మొదలుపెట్టి, క్రమంగా వ్యాయామ సమయాన్ని పెంచుకోవాలి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలి.

### 4. వ్యాయామం -- ఆరోగ్యానికి బలం

నియమిత వ్యాయామం శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, కండరాలను బలోపేతం చేయడానికి, శరీర బరువును నియంత్రించడానికి సహాయపడుతుంది. రోజూ చేయగలిగే సులభమైన వ్యాయామాలు



చిట్కా: వారానికి కనీసం 5 రోజులు వ్యాయామం చేయండి.

### 5. మంచి నిద్ర - ఆరోగ్యానికి రక్షణ

శరీరానికి విశ్రాంతి ఇవ్వడానికి నిద్ర చాలా ముఖ్యం. సరైన నిద్ర వల్ల ఏకాగ్రత మెరుగుపడుతుంది. శరీరం కోలుకోవడానికి, రోజువారీ పనులు ఉత్సాహంగా చేసుకోవడానికి సహాయపడుతుంది.

**మంచి నిద్ర కోసం పాటించాల్సినవి**
- ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవాలి.
- పెద్దలు సాధారణంగా 7--9 గంటలు నిద్రపోవాలి.
- పడుకునే ముందు మొబైల్ వినియోగాన్ని తగ్గించాలి.
- రాత్రిపూట అధిక కెఫీన్ ఉన్న పానీయాలను నివారించాలి.
- ప్రశాంతమైన, చీకటిగా ఉండే గదిలో నిద్రపోవాలి.



### ఆరోగ్యకరమైన జీవనానికి 7 బంగారు సూత్రాలు

1. సమతుల ఆహారం: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోండి.
2. తగినంత నీరు: రోజంతా నీరు తాగండి.
3. నిత్య వ్యాయామం: శారీరక చురుకుదనాన్ని పెంచుకోండి.
4. మానసిక ప్రశాంతత: యోగా, ధ్యానం అలవాటు చేసుకోండి.
5. సరైన నిద్ర: తగినంత విశ్రాంతి పొందండి.
6. చెడు అలవాట్లకు దూరం: పొగాకు, ధూమపానాన్ని నివారించండి.
7. సానుకూల ఆలోచనలు: ప్రశాంతంగా ఉండి, ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి.

ఆరోగ్యమే అసలైన ఆస్తి --- దానిని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంది.

తినండి ఆరోగ్యంగా... ఉండండి ఆనందంగా!

# క్యాచ్‌ల వేటలో తిలక్ వర్మ అరుదైన రికార్డు.. భారత క్రికెటర్లలో టాప్!

**టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తిలక్ వర్మ అరుదైన ఘనత**
**ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడు**
**కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు**
**ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించిన తిలక్**
**0.767 నిష్పత్తితో తిలక్ కంటే ముందున్న యూఏఈ ప్లేయర్ వసీమ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడిగా నిలిచాడు. అంతేకాదు.. ఈ మైలురాయిని అత్యంత సమర్థంగా చేరుకున్న భారత ఫీల్డర్‌గా రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్‌తో ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు.

### 68 మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు

తిలక్ వర్మ కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు పట్టాడు. ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించడంలో అతడు ముందున్నాడు. కనీసం 50 ఔట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న భారత ఆటగాళ్లలో ఇదే అత్యుత్తమ నిష్పత్తి. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో యూఏఈ ఆటగాడు మహమ్మద్ వసీమ్ మాత్రమే తిలక్ కంటే ముందున్నాడు. వసీమ్ 99 మ్యాచ్‌ల్లో 76 క్యాచ్‌లు అందుకుని 0.767 నిష్పత్తితో అగ్రస్థానంలో ఉన్నాడు.

### భారత దిగ్గజాల సరసన చోటు

టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో తిలక్ ఐదో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ 65 క్యాచ్‌లతో అగ్రస్థానంలో ఉండగా.. హార్దిక్ పాండ్యా 64, సూర్యకుమార్ యాదవ్ 58, విరాట్ కోహ్లీ 54 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇప్పుడు తిలక్ 50 క్యాచ్‌లతో ఈ జాబితాలో చోటు సంపాదించాడు.

# రంజీ ట్రోఫీకి అన్యాయం.. బీసీసీఐ షెడ్యూలింగ్‌పై గవాస్కర్ అసంతృప్తి

- రంజీ ట్రోఫీ సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌ల నిర్వహణపై గవాస్కర్ విమర్శలు
- కీలక ఆటగాళ్లు రాష్ట్ర జట్లకు దూరమవుతున్నారని ఆవేదన
- రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకుండా, అదే సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడాన్ని ఆయన తప్పుబట్టాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐయే తగ్గిస్తోందని ఆయన విమర్శించాడు. రంజీ ట్రోఫీ సీజన్ కొనసాగుతుండగా ఇండియా 'ఏ' మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల చాలా మంది కీలక ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండటం లేదని గవాస్కర్ అన్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్ కారణంగా రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తమ జట్ల తొలి రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారని గుర్తుచేశాడు. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ 'ఏ' పర్యటనతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. "రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొనకపోవడం వల్ల దేశవాళీ క్రికెటర్ల నిజమైన సత్తాను అంచనా వేయడం కష్టంగా మారుతోంది. రంజీల్లో రాణించిన కొందరు అంతర్జాతీయ స్థాయిలో ఇబ్బంది పడటం మనం చూస్తున్నాం" అని గవాస్కర్ పేర్కొన్నాడు. పోటీ బలహీనపడితే ఒక బ్యాటర్ 2000 పరుగులు చేయడం, బౌలర్ 100 వికెట్లు తీయడం వంటి తప్పుడు గణాంకాలు నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. అన్ని రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్లేట్ డివిజన్‌ను చేర్చడం వల్ల టోర్నీ మొత్తం ప్రమాణాలు తగ్గాయని కూడా గవాస్కర్ అన్నాడు. ఇండియా 'ఏ' మ్యాచ్‌లను దేశవాళీ సీజన్‌కు అడ్డంకి లేకుండా నిర్వహించాలని, రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని సన్నీ సూచించాడు. గవాస్కర్ వాదనకు మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా మద్దతు పలకడం గమనార్హం.

# సచిన్, యువీ, గంభీర్‌లను ఎందుకు తప్పించామో వాళ్లకు తెలుసు: సందీప్ పాటిల్

- భారత క్రికెట్ భవిష్యత్తుకే తాము ప్రాధాన్యత ఇచ్చామన్న మాజీ చీఫ్ సెలెక్టర్
- ఆ నిర్ణయాలు తన ఒక్కడివే కావని, ఐదుగురు సభ్యుల కమిటీ సమష్టిగా తీసుకుందని వెల్లడి
- స్నేహితుడని జట్టులోకి తీసుకోలేమని, దేశ ప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య
- 2012-2016 మధ్య భారత జట్టులో జరిగిన మార్పులపై కీలక విషయాలు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, జహీర్ ఖాన్ వంటి వారిని జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో లేదా వారు ఎందుకు రిటైర్ అవ్వాల్సి వచ్చిందో ఆ కారణాలు వారికే తెలుసని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెలిపాడు. భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత సంబంధాల కంటే దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు. 1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన సందీప్ పాటిల్, 2012 నుంచి 2016 వరకు ఐదుగురు సభ్యుల సీనియర్ సెలక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో పాటిల్ ఈ విషయాలను వెల్లడించాడు. "ముందుగా ఒకటి స్పష్టం చేయాలనుకుంటున్నాను. ఈ నిర్ణయాలు నేను ఒక్కడినే తీసుకున్నవి కావు. ఐదుగురు సభ్యుల సెలక్షన్ ప్యానెల్ ఉండేది, నేను దానికి ఛైర్మన్‌ను మాత్రమే. మేము తీసుకున్న ప్రతి నిర్ణయం భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదే" అని వివరించాడు. 2011 వన్డే ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులో సమూల మార్పులు అవసరమయ్యాయి. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ ఆటగాళ్ల స్థానంలో యువ ప్రతిభకు అవకాశం కల్పించారు. "సచిన్, గంభీర్, యువరాజ్, జహీర్ వంటి గొప్ప ఆటగాళ్లు జట్టుకు దూరమవడం బాధాకరమే. కానీ, ఆ కారణాలు వారికి తెలుసు. సెలెక్టర్లుగా దేశం, బీసీసీఐ, భారత క్రికెట్ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వడమే మా కర్తవ్యం" అని పాటిల్ తెలిపాడు. ఆటగాళ్లతో స్నేహం ఉండొచ్చు కానీ, వృత్తిపరమైన బాధ్యతల విషయంలో ఒక హద్దు ఉండాలని పాటిల్ అభిప్రాయపడ్డాడు. "అతడు నా స్నేహితుడు కాబట్టి జట్టులోకి తీసుకుంటాను అని చెప్పలేం. ఈ బాధ్యతను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కొన్నిసార్లు మనకు నచ్చని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది, కానీ భారత జట్టు మంచి కోసమే వాటిని అమలు చేయాలి" అని పేర్కొన్నాడు. తమ నిర్ణయాలు దీర్ఘకాల స్నేహాలను కూడా ప్రభావితం చేశా యని, అయినా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశాడు.



స్ట్రాప్‌లెస్ డెనిమ్ బాడీకాన్ డ్రెస్‌లో ఆకట్టుకుంటున్న అవికా గోర్

# నాని స్టైల్ అదుర్స్.. 'బ్లడీ రోమియో' కోసం లుక్ ఛేంజ్!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నారు. ఇటీవలే విడుదలైన 'ది ప్యారడైజ్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న నాని, వెంటనే తన తదుపరి గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బ్లడీ రోమియో' కోసం సిద్ధమయ్యారు. స్టైలిష్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా కోసం నాని సూపర్ స్టైలిష్ మేకోవర్ అయ్యారు. తాజాగా పూర్తయిన ఈ ఫోటోషూట్ విశేషాలు మరియు సినిమా అప్‌డేట్స్ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

### సుజీత్ మార్క్ వింటేజ్ అండ్ స్టైలిష్ లుక్:

టాలీవుడ్ లో 'రన్ రాజా రన్', 'సాహో', 'ఓజీ' వంటి చిత్రాలతో తనదైన స్టైలిష్ మేకింగ్‌తో ఆకట్టుకున్న దర్శకుడు సుజీత్, ఈసారి నాని లుక్‌ను పూర్తిగా రీఇన్వెంట్ చేశారు. ఈ సినిమా కోసం నాని తన హెయిర్‌స్టైల్‌ను మార్చడంతో పాటు క్రేజీ ట్రెండీ స్పెక్స్ ధరించి సరికొత్త గ్లామరస్ అండ్ రఫ్‌గా కనిపించనున్నారు. ఇక మేకర్స్ ఇప్పటివరకు నాని పూర్తి లుక్‌ను బయటకు వదలకుండా కేవలం గ్లింప్స్‌తోనే ప్రేక్షకుల్లో అంచనాలను విపరీతంగా పెంచేశారు.

### రోమియో కిచెన్ షురూ కాబోతోంది:

గత రెండేళ్లుగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్న నాని, ఇప్పుడు ఎలాంటి గ్యాప్ తీసుకోకుండా 'బ్లడీ రోమియో' సెట్స్‌లోకి అడుగుపెడుతున్నారు. అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని అత్యంత కీలకమైన యాక్షన్ ఘట్టాలను చిత్రీకరించేందుకు సుజీత్ అండ్ టీమ్ పక్కా ప్లాన్‌తో సిద్ధమయ్యారు.

### నాని వైవిధ్యమైన క్యారెక్టరైజేషన్:

ఫిల్మ్‌నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ గ్యాంగ్‌స్టర్ అవతారంలో అలరించబోతున్నారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఒక డిఫరెంట్ షేడ్ ఉన్న చెఫ్ పాత్రలోనూ లేదా ద్విపాత్రాభినయంలోనూ ఆయన కనిపిస్తారని టాక్ నడుస్తోంది. ఒకవైపు మాస్ యాక్షన్, మరోవైపు వింటేజ్ స్టైల్స్ కలగలిపి సుజీత్ ఈ కథను ఎంతో ఆసక్తికరంగా డిజైన్ చేశారు.

### నిర్మాణంలో రాజీ పడని మేకర్స్:

ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వెంకట్ బోయినపల్లి నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మాస్టర్ చెఫ్స్ కాంబినేషన్‌లో వస్తున్న 'బ్లడీ రోమియో' థియేటర్లలో ప్రేక్షకులకు మైండ్ బ్లాకింగ్ ఫీస్ట్ ఇవ్వడం ఖాయమని మేకర్స్ నమ్ముతున్నారు. సుజీత్ దర్శకత్వం, నాని పాత్ర ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్‌కు తీసుకెళ్తాయని భావిస్తున్నారు. 'బ్లడీ రోమియో' కోసం నాని కొత్త లుక్‌లోకి మారడం ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్‌గా మారింది. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. నాని పూర్తి లుక్ బయటకు వస్తే ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



ఐవరీ రంగు తామర పువ్వుల డిజైన్ చీరలో పండుగ శోభను వెదజల్లుతున్న రీతూ వర్మ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965